





సాగునీరు లేని పీఎస్ ఛానల్

పంటలను కాపాడండి

సాగునీరు లేక పంటలు ఎండుముఖం ● నీటి కోసం జొన్న, మొక్కజొన్న రైతుల ఆందోళన ● నాడు నీరు ఎక్కువై నష్టం.. నేడు నీరు అందక కష్టం

చుండూరు ఫిబ్రవరి 23: నీరిచ్చి పంటలను కాపాడండి.. అర్ధాంతరంగా కాల్వలకు సాగునీటి విడుదల నిలిపివేస్తే వేసుకున్న పంటలను బతికించుకోవడం ఎలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒకవైపు వర్షాలు.. అదే సమయంలో కాల్వలకు నీటి విడుదలతో పంటలను రైతులు నష్టపోయారు. ఇప్పుడు కాల్వల ద్వారా నీరు అందక వేసిన పంటలు ఎండుముఖం పట్టడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. తుంగభద్ర సైడ్ ఛానల్(టీఎస్), యడ్లపల్లి ఛానల్, పర్రా ఛానల్ కింద రెండో పంటగా రైతులు 9-10వేల ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. రైతులు వీటి సాగు ఖర్చుల కోసం ఎకరాకు రూ.20 వేల వరకు ఖర్చు చేశారు. ఆయా పంటలకు మరో రెండు మూడు తడులకు సాగునీరు అవసరం. అయితే అర్ధాంతరంగా కాల్వలకు నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. మొక్కజొన్నకు నాలుగు తడులు అవసరం ఉండగా ఇప్పటికి రెండు సార్లు మాత్రమే అందాయి. జొన్నకు రెండు మూడు తడులు అవసరం ఉండగా ఒక తడికే నీరు అందాయి. కాల్వల్లో తూటి కాడ విపరీతంగా ఉండటంతో కాల్వల ఎగువ భూములకు ఒకటి రెండు తడులు కూడా సక్రమంగా అందలేదు. దీంతో ఆ భూములు నెర్రబారాయి. చివరి భూముల్లో పంటలకు పురుగు మందులు పిచికారి చేసుకోవడానికి కూడా కాల్వల్లో కడవడి నీళ్ల లేకపోవడంతో రైతులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో వరికి మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో చేతికి అందివచ్చిన పంట నీటి పాలైంది. ప్రభుత్వ పరంగా పైసా ఆర్థిక సహాయం కూడా అందించలేదు. రెండో పంటైనా చేతికందివచ్చి నష్టాల నుంచి కొంతైనా ఆదుకుంటుందని రైతులు ఆశిస్తుంటే ఇరిగేషన్ అధికారులు అర్ధాంతరంగా కాల్వలకు సాగునీరు నిలిపివేసి వారి ఆశలను అడియాశలు చేశారు. దీంతో పంటలను ఎలా బతికించుకోవాలో తెలియక మండలంలోని చుండూరు, మోదుకూరు, వలివేరు, చిన పరిమి, పెదగాదెలవర్రు, చినగాదెలవర్రు, కారుమూరు వారిపాలెం, ఆలపాడు రైతులు అల్లాడుతున్నారు. సాగునీటి కోసం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు, ఇరిగేషన్ అధికారులు సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

వసతి వేతలు

● సంక్షేమ హాస్టళ్లకు ఆరునెలలుగా భోజన బిల్లులు చెల్లించని ప్రభుత్వం
● ఎస్సీ, బీసీ, ఎస్టీ వసతి గృహాలకు రూ.16 కోట్లకు పైగా బకాయి
● కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించని వైనం
● భోజన పట్టిక అమలు చేయలేని స్థితిలో నిర్వాహకులు
● అర్ధాకలితో అలమటిస్తున్న విద్యార్థులు

నా ఎస్సీలు.. నా ఎస్టీలు.. నా బీసీలు అంటున్న సీఎం జగన్ ఆయా వర్గ విద్యార్థుల సంక్షేమాన్ని గాలి కొదిలేశాడు. పేరుకే నా అంటూ.. వారిని నిండా మోసం చేస్తున్నాడు. సదరు విద్యార్థుల సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టివేశాడు. విద్యార్థుల భోజన బిల్లులు నెలల తరబడి చెల్లించడంలేదు. అర్ధాకలితో విద్యార్థులు అలమటిస్తున్నారు. చివరకు తలనూనెకు ఇంటి నుంచి డబ్బు తెచ్చుకోవాల్సిందే. కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించడంలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు రూ.16 కోట్లకు పైగా బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. విద్యార్థుల కడుపు మాడ్చలేక.. అప్పులు తీర్చలేక.. వసతి గృహాల అధికారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వారు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. కనీసం సరుకుల కొనుగోలుకు అప్పులు పుట్టని దుస్థితిని ఎదుర్కొంటున్నారు.

ఆరునెలలుగా వసతి గృహాలకు భోజన బిల్లులు చెల్లించలేదు. హాస్టల్స్‌ను ఎలా నిర్వహించగలం. మా పరిస్థితి పగవాడికి కూడా రాకూడదు. ప్రభుత్వం డైట్ బిల్స్‌కు గ్రీన్‌ఛానల్ ఉందని చెబుతున్నా బిల్లులు చెల్లించడంలేదు. సహాయక సంక్షేమాధికారి వారి లాగిన్ నుంచి బిల్స్ ట్రెజరీకి అప్‌లోడ్ కాకుండా నిలిపివేశారు. మా 26 ఏళ్ల సర్వీసులో ఇంత దారుణం ఎప్పుడూ చూడలేదు.
- ఓ వసతి గృహ నిర్వాహకుని ఆవేదన

ఖర్చు నెలకు రూ.2,200.. ఇచ్చేది రూ.1,400

కళాశాలల విద్యార్థులకు నెలకు రూ.1,600, స్కూల్స్ విద్యార్థులకు నెలకు రూ.1,400 భోజనం కోసం ప్రభుత్వం చెల్లిస్తోంది. కళాశాలల విద్యార్థులకు రోజు వసతి గృహంలో ఉదయం టిఫిన్, రెండు పూటల భోజనం అందించాలి. స్కూల్స్ విద్యార్థులకు ఉదయం టిఫిన్, ఒక పూట భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించాలి. స్కూల్స్ సెలవు రోజుల్లో రెండు పూటలా భోజనం వడ్డించాలి. కళాశాలల విద్యార్థులకు రోజుకు రూ.53.33, స్కూల్ విద్యార్థులకు రోజుకు రూ.46.66కు భోజనం, ఉదయం టిఫిన్ అందించాలి. ఉదయం అల్పాహారం రోజుకో రకం వేరుశనగ చట్నీతో, బెల్లంతో రాగి జావ, చిక్కీలు, రాత్రి భోజనం, అరటి పండు, వారంలో మూడు రోజుల చికెన్, ఆరు రోజులు ఉడికించిన గుడ్డు ఇవ్వాలి. పాలు అందించాలి. ఇలా మెనూ అమలుకు ఒక్కో విద్యార్థికి నెలకు రూ.2,200 ఖర్చు అవుతున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. మెనూ ఛార్జీలు పెంచాలని పదే పదే వినతిపత్రాలు అందిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెనూ ప్రకారం ఇవ్వాలంటే తమ జీతాలు కూడా సరిపోవని కొందరు నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వం వసతి గృహాల్లో భోజనానికి సంబంధించి సరుకుల ధరలు మార్కెట్ కనుగుణంగా పెంచకుండా విద్యార్థుల కడుపు కాల్చుతోంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణపై నిర్లక్ష్యం అలముకుంది. వేలాదిమంది విద్యార్థుల సంక్షేమానికి పాలకులు గండికొడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో తొమ్మిదివేల మంది విద్యార్థులు ఉంటూ చదువుకొంటున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. ఆరునెలలుగా వసతి గృహాల బిల్లులు ప్రభుత్వం విడుదల చేయలేదు. రూ.16 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. కాస్మొటిక్ ఛార్జీలకు సదరు విద్యార్థులు నోచుకోలేదు. వసతి గృహాల నిర్వహణకు సంబంధించిన నిధుల్లో 60శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో బిల్లులు చెల్లించలేని దుస్థితి ఏర్పడింది.

ధరలకు పొంతన లేదు..

వసతి గృహాలకు ప్రభుత్వం చెల్లించే సరుకుల ధరలకు మార్కెట్ ధరలకు పొంతనే లేదు. మార్కెట్‌లో సరకుల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. కూరగాయల ధరలు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.సరుకులు, గ్యాస్, పాలు అప్పు పద్ధతిలో కొనుగోలు చేసి బిల్లులు విడుదలైన సమయంలో వాటిని వసతి గృహాల అధికారులు చెల్లించేవారు. ఆరు నెలలుగా మెస్ బిల్లులు విడుదల కాకపోతుండటంతో షాపుల్లో అప్పు దొరకడం లేదు. ఈ నేపథ్యంలో నిర్దేశించిన భోజన పట్టికను అమలు చేయలేకపోతున్నారు. అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అప్పులు పుట్టక అవస్థలు..

ఆరు నెలలుగా బిల్లులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు ఆహారం అందించడంలో హెచ్‌డబ్ల్యూవోలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వంద మంది విద్యార్థులు ఉంటే నెలకు రూ.1.20 లక్షలు ఖర్చు అవుతోందని చెబుతున్నారు. ఇలా లెక్కిస్తే వంద మంది విద్యార్థులు ఉన్న వసతి గృహానికి ఈ నెల వరకు రూ.7.20 లక్షలు చెల్లించాల్సి ఉంది. వారికి వచ్చే జీతం కూడా సరుకుల కోసం వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు. బంగారం కుదువ పెట్టి కూడా అప్పులు చేస్తున్నవారు ఉన్నారు.

బియ్యం కొనుగోలుకు సొంతంగా చెల్లించాల్సిందే...

వసతి గృహాలకు డీలర్ల ద్వారా బియ్యం సరఫరా చేస్తారు. కిలో రూపాయి చొప్పున డీడీ రూపంలో చెల్లిస్తేనే బియ్యం వసతి గృహాలకు సరఫరా చేస్తారు. 20 కింటాళ్ల బియ్యం కొనుగోలు చేయాలంటే రూ.2వేలు డీడీ చెల్లించాలి. గతంలో ప్రభుత్వం బియ్యం కోసం డబ్బు చెల్లించేది. ఈ ప్రక్రియ కూడా నిలిచిపోయింది. హెచ్‌డబ్ల్యూవోలు వారి సొంత డబ్బు చెల్లించి బియ్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. గ్యాస్ అప్పు లభించే పరిస్థితి లేదు. గ్యాస్ కూడా నిర్వాహకులే కొనుగోలు చేస్తున్నారు. సరుకులు, పాలు, కూరగాయలు అప్పుపై సరఫరా చేసే అవకాశం ఉంది. అయితే నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో వాటికి సరఫరా కూడా కొన్ని వసతి గృహాలకు నిలిచిపోయింది.

ఎస్సీ శాఖ ముఖ్యకార్యదర్శిని కోరినా..

బిల్లులు చెల్లించాలని పదే పదే కోరుతున్నా హెచ్‌డబ్ల్యూవోల మొర ఆలకించే వారే కరువయ్యారు. ఇటీవల ఎస్సీ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ నిర్వహించిన సమావేశంలో బిల్లుల బకాయిల అంశాన్ని హెచ్‌డబ్ల్యూవోలు ప్రస్తావించారు. బిల్లులు చెల్లించాలని కోరినా వారు నేటికీ స్పందించక పోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో బిల్లులు తక్షణమే చెల్లించకపోతే వసతి గృహాలను మూసివేయాలని సదరు అధికారుల సంఘం నిర్ణయించింది. ఈమేరకు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిని కలిసి లేఖ ఇవ్వాలని యూనియన్ నిర్ణయించినట్టు వారు చెబుతున్నారు. ఇదే జరిగితే విద్యార్థులు వసతి గృహాల నుంచి ఇంటికి వెళ్లాల్సి వస్తుంది.

కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించలేదు..

ప్రభుత్వం విద్యార్థులకు నెలవారీ కాస్మొటిక్ ఛార్జీల నగదు ఇవ్వడం లేదు. దీంతో తలనూనె కొనాలన్నా, సబ్బు కావాలన్నా ఇంటి వైపు చూడక తప్పడంలేదు. ప్రతి నెలా తమ తల్లిదండ్రులను ఖర్చులకు డబ్బులు పంపమని అడగడం పరిపాటిగా మారింది. వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రతి నెలా కాస్మొటిక్ ఛార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వ తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున తల నూనె, సబ్బులు ఇతర సామాగ్రి కొనుగోలుకు ఇస్తుంది. బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ ఛార్జీల కింద అదనంగా విడుదల చేస్తుంది. విద్యార్థుల బ్యాంకు ఖాతాలకే నేరుగా కాస్మొటిక్ ఛార్జీలను జమ చేయాలి. ఆరు నెలలుగా ఛార్జీల ఊసేలేదు.

కనీస వసతులకు నిధులు లేవు..

వసతి గృహాల నిర్వహణకు నిధులు విడుదల కావడంలేదు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు నిర్వాహకులు వాపోతున్నారు. చివరకు మాడిపోయిన బల్బును మార్చాలన్నా వారి జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి, అవసరమైన మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదు. కనీస వసతులకు హెచ్‌డబ్ల్యూవోలు సొంతంగా ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందన్న విమర్శలున్నాయి.

బీసీ, ఎస్టీ వసతి గృహాలకు బిల్లుల బకాయి

ఎస్సీలే కాదు బీసీ, ఎస్టీ వసతి గృహాలకు కూడా నెలల తరబడి భోజన బిల్లులు చెల్లిండంలేదు. ఈ విద్యాసంవత్సరంలో ఆయా వసతి గృహాలకు అక్టోబరు వరకే బిల్లులు చెల్లించినట్టు సదరు అధికారులు తెలిపారు. దాదాపు నాలుగునెలలుగా బీసీ, ఎస్టీ వసతి గృహాలకు బిల్లులు నిలిచిపోయాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బిల్లులు చెల్లించక పోవడంతో నిర్వాహకులు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీసీ వసతి గృహాలకు రెండు మూడింటికి ఒకే అధికారి ఉన్నారు. దీంతో బకాయిలు పేరుకుపోవడంతో వసతి గృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తే బిల్లులు విడుదల కావన్న ఆందోళన వసతి గృహాల అధికారుల్లో నెలకొంది.



నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

తెనాలిలో డయేరియా.. కలకలం

● గుంటూరులో చికిత్స పొందుతూ మహిళ మృతి
● మరో 20 మందికిపైగా ఆస్పత్రుల్లో చికిత్సలు
● సమాచారం ఇచ్చినా పట్టించుకోని మున్సిపాలిటీ
● నెల నుంచి కలుషిత నీరు వస్తుందంటున్న ప్రజలు
● గురవయ్యకాలనీలోని బాధితులను పరామర్శించిన నాదెండ్ల



మృతురాలు లక్ష్మి కోడలు కలుషిత నీటి పరిస్థితి వివరిస్తున్న చిత్రం

తెనాలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెనాలిలోని గురవయ్యకాలనీకి మున్సిపాలిటీ సరఫరా చేసే తాగునీరు కొద్ది రోజులుగా రంగుమారి, వాసన వస్తుంది. ఈ విషయాన్ని మున్సిపల్ సిబ్బందికి మొరపెట్టుకున్నారు. చెప్పినరోజు నీటి సరఫరా ఆపేయడం, ఆ తర్వాత పునరుద్ధరించినా మురుగు నీటి వాసన పోలేదు. ఈ పరిస్థితుల్లో అదే నీటిని కాచి చల్లార్చి తాగామని, అయినా ఫలితం లేకపోయిందని, వాంతులు, విరేచనాలతో ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చిందని కాలనీవాసులు చెబుతున్నారు. గురవయ్యకాలనీ, పూలే కాలనీ, సుల్తానాబాద్, మరికొన్ని శివారు కాలనీల్లోనూ డయేరియా కేసులు భారీగానే నమోదయ్యాయి. పది రోజుల క్రితమే సుమారు 25 మంది వరకు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాల్లో చికిత్స పొందారు. అయితే డయేరియా అని నమోదు చేయకుండా మున్సిపల్ అధికారులు జాగ్రత్త పడ్డారే కానీ, ప్రజల్ని కాపడటానికి మాత్రం ఏ చర్యలూ తీసుకోలేదు.

ఒక మహిళ మృతి... ఆస్పత్రుల్లో బాధితులు

గురవయ్య కాలనీకి చెందిన బండి లక్ష్మి(60) అనే మహిళ చనిపోతే, మరో 20 మంది గుంటూరు జిల్లా వైద్యశాలలో, మరి కొందరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని సమాచారం. మూడు రోజుల క్రితం వాంతులు, విరేచనాలతో తెనాలి జిల్లా వైద్యశాలలో లక్ష్మి చేరగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు పంపారు. అక్కడికి వెళ్లిన గంటకే ఆమె చనిపోయినట్లు లక్ష్మి కోడలు తెలిపారు. ఆమెతోపాటే మరో 15 మంది వరకు ఆస్పత్రుల్లో చేరారని బాధితులు చెబుతున్నారు. పూలే కాలనీ నుంచి ఇద్దరు, సుల్తానాబాద్‌కు చెందిన నలుగురు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని, శుక్రవారమే ఇంటికి వచ్చిన కొందరు బాధితులు తెలిపారు. మరో ఏడుగురు వరకు ప్రైవేటు వైద్యశాలల్లో చేరినట్లు తెలిపారు.

నెల నుంచే నీటి సరఫరా సరిగాలేదని, రంగు మారి వాసన వస్తుందని మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోకుండా, కనీసం నీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపకుండా వదిలేయడం విమర్శలకు తావిస్తోంది. రెండు రోజుల నుంచి భారీగా డయేరియా లక్షణాలతో కేసులు వస్తున్నాయని, తెనాలి జిల్లా వైద్యశాల సిబ్బంది, ప్రైవేటు ఆస్పత్రుల సిబ్బంది సమాచారం ఇచ్చినా మున్సిపల్ ప్రజారోగ్య విభాగం పూర్తిగా గాలికొదిలేసింది. శుక్రవారం నాదెండ్ల మనోహర్ కాలనీల్లో పర్యటనకు వెళ్లిన సమయంలో బాధితులు వివరించటంతో ఆయన దీనిపై ఘాటుగా స్పందించారు. జనం చచ్చిపోతుంటే, ప్రజాప్రతినిధి విందు రాజకీయాల్లో బిజీగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు కూడా ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారని విమర్శించారు.

అన్నీ.. గొప్పలే..!

● ప్రహసనంగా మారిన రైతుభరోసా కేంద్రాల్లో ఎరువుల అమ్మకాలు
● ఖరీఫ్, రబీ రెండు సీజన్‌లలో కలిపి విక్రయించింది 14,670 టన్నులే
● సిబ్బందికి టార్గెట్లు.. వైసీపీ నేతలకు ఉదారంగా ఎరువులు

బాపట్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రైతుభరోసా కేంద్రాల్లో అన్నదాతలకు అందని సేవలు లేవంటూ ఊకదంపుడు ప్రసంగాలను ఇస్తున్నారు. ఆ మాటలే నేతిబీరకాయలోని నేతి చందంగానే మిగిలిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీ రెండు సీజన్‌లలో కలిపి ఆర్‌బీకేల ద్వారా విక్రయించిన ఎరువులు కేవలం 14,670 టన్నులే. అంటే జిల్లాలో అన్నదాతలు వినియోగించే మొత్తం ఎరువుల్లో రైతుభరోసా కేంద్రాల వాటా 7 శాతం లోపే ఉంది. మిగిలినదంతా బహిరంగ మార్కెట్ ద్వారానే రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఈ వాస్తవం మరుగునపరచి ఆర్‌బీకేల ద్వారానే అన్నదాతలు ఎరువులు పెద్దఎత్తున కొనుగోలు చేస్తూ లాభ పడుతున్నారనేది ప్రభుత్వ వాదన. పైగా బహిరంగ మార్కెట్ కంటే ఆర్‌బీకేలలోనే ఎక్కువ ధర వసూలు చేస్తున్నారనేది రైతుల ఆరోపణ. అమ్మకాల తంతు ఇలా ఉంటే వైసీపీ నేతలు అరువుపై తీసుకెళ్లిన ఎరువుల డబ్బుల వసూలు విషయంలో సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ ఒత్తిళ్ల తట్టుకోలేక వేమూరు మండలం చావలి రైతుభరోసా కేంద్రంలో పని చేస్తున్న ఓ ఉద్యోగిని ఇటీవలే ఆత్మ హత్య చేసుకున్న విషయం తెలిసిందే. మొత్తంగా చూస్తే ఆర్‌బీకేలలో ఎరువుల అమ్మకం అనేది నామ మాత్రం తప్పించి అన్నదాతలకు ఒనగూరుతున్న ప్రయోజనం గుండుసున్నా. పైగా ఇక్కడ కూడా ఎరువులు అప్పుగా తీసుకుని వైసీపీ చోటా మోటా నాయకులే లాభపడుతున్నారని రైతులు మండిపడుతున్నారు.



వీరన్నపాలెం రైతు భరోసా కేంద్రం

ఎటువంటి అదనపు ప్రయోజనం లేదు..

రైతుభరోసా కేంద్రాల వద్ద ఎరువులు కొనడం వల్ల అన్నదాతలకు ఒనగూరుతున్న మేలేమి అదనంగా లేకపోగా పలు ఇబ్బందులే ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఎరువులకు సంబంధించి కావాల్సిన బ్రాండు విషయంలో రైతులకు అగచాట్లు తప్పడం లేదు. పైగా ఉన్నవే తీసుకెళ్లాలనే సమాధానం సిబ్బంది నుంచి రావడం కొసమెరుపు. ఒక్కోసారి బహిరంగ మార్కెట్ కన్నా ఎక్కువ ధర ఆర్‌బీకేలలో చెల్లించాల్సి వస్తుందని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ఇక ఇండెంట్ అని కాలయాపన కూడా రైతులకు ప్రతిబంధకంగా మారింది. ఆర్డర్ పెట్టిన తర్వాత వారం రోజుల తర్వాతగాని ఎరువులు రైతులకు చేరడం లేదనే విమర్శ ఉంది. దీంతో అన్నదాతలు బహిరంగ మార్కెట్‌వైపే మొగ్గు చూపుతున్నారని రైతు సంఘాలు చెబుతున్నాయి.

వైసీపీ నేతల దెబ్బకు సిబ్బంది హడల్..

రైతుభరోసా కేంద్రాల్లో అమ్మకాలే అరకొరగా ఉన్నాయంటే ఆ కాస్తా అమ్మకాలు కూడా వైసీపీ చోటా మోటా నేతలకు వరంగా మారాయని తెలుస్తోంది. పాలకపార్టీ నేతలు అన్న ఒక్క ట్యాగ్‌లైన్‌తో తీసుకెళ్లిన ఎరువులకు సకాలంలో డబ్బులు చెల్లించకుండా వేధిస్తున్న ఘటన ఒకటి ఇటీవల వెలుగుచూసిన సంగతి తెలిసిందే. అన్నదాతల విస్తృత ప్రయోజనాల కోసం అమల్లోకి తెచ్చిన ఎరువుల విక్రయాలను కూడా వైసీపీ నేతలు సొమ్ము చేసుకోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డిమాండ్ ఉన్నప్పుడు పత్తా ఉండరు..

ఎరువులకు వ్యవసాయ సీజన్ ఆరంభంలో మంచి డిమాండ్ ఉంటుంది. మామూలు సమయాల్లో అన్నదాతల దగ్గర నుంచి ఎరువుల కోసం ఇండెంట్ తీసుకునే ఆర్‌బీకే సిబ్బంది డిమాండ్ అప్పుడు మాత్రం స్పందన కరువవతోందని రైతులు వాపోతున్నారు. బయట మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉన్నప్పుడు విరివిగా ఎరువులను రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచి ఆదుకోవాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా బయట బ్లాక్‌మార్కెట్‌ను ప్రోత్సహించే విధంగానే పాలకుల చర్యలు ఉండడం పట్ల అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో డీలర్లతో ప్రభుత్వ పెద్దలు కుమ్మక్కయి మరీ కృత్రిమ కొరత సృష్టించి తమను నిలువునా దోచుకున్న సందర్భాలు కోకొల్లలు అని రైతులు వాపోతున్నారు.

రెండు సీజన్లలో కలిసి విక్రయించింది 14,670 టన్నులు..

ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో రైతుల దగ్గర నుంచి ఇండెంట్ తీసుకుని ఆయా ఆర్‌బీకేలలో ఉంచిన ఎరువులు 15,795 మెట్రిక్ టన్నుల ఎరువులు కాగా ఇందులో విక్రయించింది 14,670 టన్నులే కావడం గమనార్హం. వాస్తవానికి జిల్లాలో ఉన్న సాగు విస్తీర్ణాన్ని బట్టి రెండు సీజన్లలో కలిపి దాదాపు లక్షన్నర టన్నుల వరకు ఎరువుల వాడకాన్ని అన్నదాతలు చేపడ తారనేది అంచనా. రైతులు వినియోగిస్తున్న ఎరువులతో పోలిస్తే ఆర్‌బీకేల ద్వారా అమ్మకం జరిగినది నామమాత్రమే.

రూ.221.41 కోట్లతో అమృత్‌స్టేషన్ల అభివృద్ధి

గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ



గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ స్టేషన్ స్కీం(ఏబీఎస్‌ఎస్) కింద గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో 13 రైల్వేస్టేషన్ల రూపురేఖలను మార్చబోతున్నట్లు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. పలు స్టేషన్లలో పనులు ప్రారంభమయ్యాయని, ఈ నెల 26వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో లింకు ద్వారా ఆయా పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. శుక్రవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో డీఆర్‌ఎం మాట్లాడారు. గుంటూరు, మంగళగిరి, నంద్యాల, గిద్దలూరు, కంభం, మార్కాపురం, నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, నడికుడి, మాచర్ల, మిర్యాలగూడ, నల్గొండ రైల్వేస్టేషన్లను అమృత్‌స్టేషన్లుగా ప్రకటించడం జరిగిందన్నారు. వీటిని సిటీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తామని, నగరం/పట్టణానికి ఇరువైపులా యాక్సెస్ కలిగివుంటాయన్నారు. పలు స్టేషన్లలోకి బస్సులు కూడా వచ్చి ప్రయాణీకులు దించి వెళ్లేలా సర్క్యులేటింగ్ ఏరియాలను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైళ్లు, ప్రయాణీకుల భద్రతలో భాగంగా 10 ఎల్‌సీ గేట్లను తొలగించి వాటి స్థానంలో ఆర్‌యూబీల నిర్మాణం చేపట్టబోతున్నామన్నారు. కురిచేడు, వినుకొండ టౌన్, మునుమాక, వేములూరిపాడు, కొప్పురావూరు, కంతేరు, దాచేపల్లి, నాగ్కెడ్‌పల్లి, బుదారం, కేసరాజుపల్లి గేట్లను తొలగించి ఆర్‌యూబీ లను రూ.36.28 కోట్లతో నిర్మాణం చేపట్టబోతున్నామన్నారు. సమావేశంలో ఏడీఆర్‌ఎంలు ఆర్.శ్రీనివాస్, కె. సైమన్, డీసీఎం (కో-ఆర్డినేషన్) డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



మరోసారి క్వీన్ రాక

కంగనా రనౌత్‌కు కథానాయికగా విశిష్ట గుర్తింపు తెచ్చిన బాలీవుడ్ చిత్రం 'క్వీన్'. పదేళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. చాలాకాలంగా ప్రేక్షకులు 'క్వీన్'కు సీక్వెల్ చేయాలని కంగనను కోరుతున్నారు. వారి కోరిక త్వరలోనే నెరవేరబోతోంది. 'క్వీన్ 2' చిత్రానికి స్ర్కిప్ట్ సిద్ధం చేసినట్లు దర్శకుడు వికాస్ బహల్ తెలిపారు. సీక్వెల్‌లోనూ కంగన రనౌత్ రాణీగా లీడ్ రోల్ లో కనిపించనున్నారు. త్వరలోనే ప్రీ ప్రొడక్షన్ ప్రారంభించి, ఆగస్టు కల్లా సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తామని వికాస్ తెలిపారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

దుబాయ్‌లో గామా అవార్డుల వేడుక



తెలుగు చిత్ర పరిశ్రమ గర్వపడేలా మార్చి 3న దుబాయ్‌లో 'గామా' అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా నిర్వహించనున్నారు. జ్యూరీ చైర్మన్, సంగీత దర్శకుడు కోటి, జ్యూరీ సభ్యులు... నిర్మాత డీవీవీ దానయ్య, దర్శకుడు వీఎన్ ఆదిత్య తదితరులు శుక్రవారం ఈ వేడుకకు సంబంధించిన ట్రోఫీని ఆవిష్కరించారు. పలు విభాగాల్లో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తులకు ఈ పురస్కారాలు అందజేస్తామనీ, పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతారనీ కోటి తెలిపారు. సినీ రంగంలో కొత్త ప్రతిభను ప్రోత్సహించడానికి త్రిమూర్తులు నిర్వహిస్తున్న ఈ వేడుక తెలుగు చిత్ర పరిశ్రమకు గర్వకారణమని డీవీవీ దానయ్య, వీఎన్ ఆదిత్య చెప్పారు.

పిల్లబచ్చాలు మా సినిమాకు రావొద్దు



అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న డిఫరెంట్ హారర్ థ్రిల్లర్ 'తంత్ర'. ధనుష్ రఘుముద్రి కథానాయకుడు. సలోనీ కీలకపాత్రలో నటిస్తున్నారు. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేశ్‌బాబు పి, రవిచైతన్య నిర్మిస్తున్నారు. తమ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ రావడంపై 'తంత్ర' టీమ్ వినూత్నంగా స్పందించింది. 'మా సినిమాకు పిల్లబచ్చాలు రావొద్దు' అని పేర్కొంటూ పోస్టర్ రిలీజ్ చేసింది. హారర్ ఎలిమెంట్స్‌తో తమ సినిమా థ్రిల్ చేస్తుందనీ, త్వరలో ట్రైలర్ విడుదల చేస్తామని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: ఆర్ఆర్ ధ్రువన్. సినిమాటోగ్రఫీ: సాయిరామ్ ఉదయ్, విజయ్ భాస్కర్ సద్దాల.

బ్యాడ్‌బాయ్స్ లవ్‌స్టోరీ



వినూత్న ప్రేమ కథా చిత్రం 'వుయ్ లవ్ బ్యాడ్‌బాయ్స్'. రాజు రాజేంద్ర ప్రసాద్ దర్శకత్వంలో పప్పుల కనకదుర్గారావు నిర్మించారు. ఇటీవలే సెన్సార్ పూర్తయిన ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు వశిష్ఠ విడుదల చేసి, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. అలీ, సప్తగిరి, భద్రం ప్రధాన తారాగణం. నేటి ట్రెండ్‌కు తగినట్లు కామెడీ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించామనీ, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు. రఘు కుంచెతో కలసి భూషణ్ జాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: వీకే రామరాజు.

మార్కెట్‌లో మహాలక్ష్మి సందడి



'కేరింత' ఫేం పార్వతీశం కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. ప్రణీకాన్వికా కథానాయిక. వీఎస్ ముఖేశ్ యువ దర్శకత్వంలో అఖిలేశ్ కలారు నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను హీరో శ్రీ విష్ణు ఆవిష్కరించారు. "మార్కెట్ మహాలక్ష్మి' టీజర్‌లో హీరో హీరోయిన్ పాత్రలు ఫన్నీగా అనిపించాయి. పార్వతీశం కామెడీ టైమింగ్ బావుంది. దర్శకుడి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో ఈ చిత్రం తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. 'ఆకట్టుకునే ప్రేమకథతో పాటు కుటుంబ అనుబంధాలను మనసుకు హత్తుకునేలా తెరకెక్కిస్తున్నాం' అని నిర్మాత తెలిపారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/D9npawbలో చదవండి.





దిక్సూచి DIKSUCHI



ఏపీ ఆర్‌సెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ) తరపున తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ(ఎస్‌వీయూ)- రీసెర్చ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ ఆర్‌సెట్) 2023-24 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్ ద్వారా పార్ట్ టైం/ఫుల్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, అనుబంధ కళాశాలలు, రీసెర్చ్ సెంటర్లలో అడ్మిషన్స్ ఇస్తారు.

యూనివర్సిటీలు-సీట్లు

యూనివర్సిటీ	ఫుల్ టైమ్	పార్ట్ టైమ్
ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు	155	76
ఆదికవి నన్నయ యూనివర్సిటీ, రాజమండ్రి	86	36
ఆంధ్ర కేసరి యూనివర్సిటీ, ఒంగోలు	43	37
ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖపట్నం	131	70
డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం	15	12
ద్రవిడియన్ యూనివర్సిటీ, కుప్పం	33	30
జేఎన్‌టీయూ, అనంతపురం	86	298
జేఎన్‌టీయూ, కాకినాడ	-	426
జేఎన్‌టీయూజీ, విజయనగరం	1	14
కృష్ణ యూనివర్సిటీ, మచిలీపట్నం	33	12
రాయలసీమ యూనివర్సిటీ, కర్నూలు	2	3
ఆర్‌జీయూకేటీ, నూజివీడు	5	7
ఆర్‌జీయూకేటీ, ఆర్‌కే వ్యాలీ	5	5
శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ, అనంతపురం	45	31
శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, తిరుపతి	69	56
శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి	114	95
విక్రం సింహపురి యూనివర్సిటీ, నెల్లూరు	31	14
యోగి వేమన యూనివర్సిటీ, కడప	84	27

స్పెషలైజేషన్‌లు: అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, బుద్దిస్ట్ స్టడీస్, కామర్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లీష్, ఫైన్‌ఆర్ట్స్, ఫోక్‌లోర్, హిందీ, హిస్టరీ, ఇంటర్నేషనల్ అండ్ ఏరియా స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, లా, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, లింగ్విస్టిక్స్, మేనేజ్‌మెంట్, మ్యూజిక్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిలాసఫీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, డా.బీఆర్.అంబేద్కర్ స్టడీస్, రూరల్ డెవలప్‌మెంట్, సోషల్ వర్క్, సోషియాలజీ, సంస్కృతం, తెలుగు, టూరిజం మేనేజ్‌మెంట్, ఉమన్ స్టడీస్, అప్లయిడ్ లైఫ్ సైన్సెస్, బయో కెమిస్ట్రీ, బోటనీ, కెమికల్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జాగ్రఫీ, జియాలజీ, హోం సైన్స్, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, సెరికల్చర్, స్టాటిస్టిక్స్, జువాలజీ, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్, ఫార్మసీ, బయోటెక్నాలజీ, కంపారటివ్ ద్రవిడియన్ లిటరేచర్, తుళు, మహాత్మా జ్యోతి రావు పూలే స్టడీస్, ఉర్దూ, జియో ఇంజనీరింగ్, మెటియోరాలజీ అండ్ ఫిజికల్ ఓషనోగ్రఫీ.

అర్హత వివరాలు: కనీసం 55 శాతం మార్కులతో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, కామర్స్, లా, ఫార్మసీ, ఇంజనీరింగ్ విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. అనుభవం ఉన్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏపీ ఆర్‌సెట్ వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్లో స్పెషలైజేషన్‌కు సంబంధించిన రీసెర్చ్ మెథడాలజీ నుంచి 70 ప్రశ్నలు, రెండో సెక్షన్లో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 70 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. ఇందులో అర్హత పొందాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 45 శాతం మార్కులు రావాలి. ఈ టెస్ట్‌లో అర్హత పొందినవారిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు. దీనికి 60 మార్కులు నిర్దేశించారు.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; బీసీ అభ్యర్థులకు రూ.1300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **చివరి తేదీ:** మార్చి 19
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in/rcet

బిట్స్ పిలానీ డబ్ల్యుఐఎల్పీ - పీజీ డిప్లొమాలు

ప్రసిద్ధ సాంకేతిక విద్యా సంస్థ - బిట్స్ పిలానీకి చెందిన వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్(డబ్ల్యుఐఎల్పీ) విభాగం మూడు సరికొత్త పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లను ప్రకటించింది. కెరీర్‌కు ఎలాంటి బ్రేక్ ఇవ్వకుండానే ఈ కోర్సులను చేసే అవకాశాన్ని బిట్స్ కల్పిస్తోంది. మార్చి 18లోపు వీటికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ స్మార్ట్ మొబిలిటీ:** స్మార్ట్ మొబిలిటీ కాన్సెప్టులు, టెక్నాలజీలు, పాలసీలపై సమగ్ర అవగాహన కల్పించే విధంగా ఈ ప్రోగ్రామ్‌ని మలిచారు. మరిన్ని వివరాలకు - https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-smart-mobility.php
- **పీజీ డిప్లొమా ప్రోగ్రామా ఇన్ ఎలక్ట్రికల్ వెహికల్స్:** ఎలక్ట్రిక్ వెహికల్స్ డిజైన్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్, ఈవీ రెగ్యులేషన్స్ తదితరాలను కలుపుతూ ఈ ప్రోగ్రామ్‌ని తీర్చిదిద్దారు మరిన్ని వివరాలకు - https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-electric-vehicles.php
- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ ఆటోమోటివ్ సైబర్ సెక్యూరిటీ:** సైబర్ సెక్యూరిటీ సిస్టమ్స్‌పై సంపూర్ణ అవగాహన కలిగించే విధంగా ఈ కోర్సును మలిచారు. https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-automotive-cybersecurity.php

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/F6CVv3zలో చదవండి.

జాబ్ కార్నర్

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 3000 అప్రెంటిస్‌లు

ముంబయిలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్(రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డివిజన్) సెంట్రల్ ఆఫీస్... దేశవ్యాప్తంగా రీజియన్ల వారీగా బ్యాంకు శాఖల్లో అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీలు: 100 (గుంటూరు- 40, విజయవాడ-30, విశాఖపట్నం-30)

తెలంగాణలో ఖాళీలు: 90(హైదరాబాద్-58, వరంగల్-38)

శిక్షణ కాలం: ఒక సంవత్సరం

అర్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

స్టయిపెండ్: నెలకు రూరల్/సెమీ అర్బన్ శాఖలు రూ.15,000. పట్టణ శాఖలు రూ.15,000. మెట్రో శాఖలు రూ.15,000.

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ధ్రువపత్రాల పరిశీలన, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష: ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 1. క్వాంటిటేటివ్, జనరల్ ఇంగ్లిష్, రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్. 2. బేసిక్ రిటైల్ లయబిలిటీ ప్రొడక్ట్స్. 3. బేసిక్ రిటైల్ అసెట్ ప్రొడక్ట్స్ 4. బేసిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్ 5. బేసిక్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు.

దరఖాస్తు రుసుము: రూ.800. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్/ మహిళా అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులకు రూ.400.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: మార్చి 6

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: మార్చి 10

వెబ్‌సైట్: www.centralbankofindia.co.in/en

సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో 1425 ఖాళీలు

బిలాస్‌పూర్(ఛత్తీస్‌గఢ్)లోని కేంద్ర బొగ్గు గనుల శాఖకు చెందిన సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎస్ఈసీఎల్)... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: గ్రాడ్యుయేట్ ఇంజనీర్(మైనింగ్/ఎలక్ట్రికల్/మెకానికల్/సివిల్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్). డిప్లొమా(మైనింగ్/మైనింగ్, మైన్ సర్వేయింగ్/మెకానికల్/సివిల్ ఇంజనీరింగ్)

అర్హత: సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఉత్తీర్ణత సంవత్సరం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 27

వెబ్‌సైట్: www.seclcil.in/index.php

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీలో 490 జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు

న్యూఢిల్లీలోని ప్రభుత్వరంగ సంస్థ... ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా... దేశ వ్యాప్తంగా ఉన్న ఏఏఐ కార్యాలయాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఆర్కిటెక్చర్): **3 పోస్టులు**
2. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్ - సివిల్): **90 పోస్టులు**
3. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్ - ఎలక్ట్రికల్): **106 పోస్టులు**
4. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఎలక్ట్రానిక్స్): **278 పోస్టులు**
5. జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ): **13 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్/ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ గేట్ 2024 స్కోరు ఉండాలి.

దరఖాస్తు రుసుము: రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఏప్రిల్ 2 **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 1

వెబ్‌సైట్: www.aai.aero/





వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

రాజధాని అమరావతిపై వైసీపీ కుట్ర

● 1,528వ రోజుకు చేరుకున్నరైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 23: రాష్ట్రానికి సంపదనిచ్చే రాజధాని అమరావతిని వైసీపీ ప్రభుత్వం మూడుముక్కల ఆటతో సర్వనాశనం చేసిందని 33వేల ఎకరాలను త్యాగం చేసిన రైతులు అన్నారు. అమరావతిని భ్రమరావతి అని ప్రపంచానికి తప్పుడు ప్రచారం చేశారన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1528వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు రాజధాని రైతు ధర్నా శిబిరాల నుంచి మాట్లాడుతూ రాజధాని అమరావతిని, రాష్ట్ర ప్రజల జీవనాడి అయిన పోలవరాన్ని జగన్‌రెడ్డి విస్మరించాడన్నారు. ఆంధ్రప్రదేశ్‌ని 20 ఏళ్ల వెనకబాటుకు గురిచేశారన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి బైర్లు కమ్మిన కళ్లను తెరవాలన్నారు. రాజధానిని నాశనం చేయటం వెనక కుట్ర దాగి ఉందన్నారు. రైతులు చేస్తున్న ఉద్యమాన్ని అవమాన పరిచారన్నారు. హైకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. తుళ్లూరు, వెంకటపాలెం, వెలగపూడి, మందడం, నెక్కల్లు, అనంతవరం తదితర రాజధాని గ్రామాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

ఉత్సాహంగా ఎడ్ల బలప్రదర్శన


సీనియర్స్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన ఎడ్లజత

మాచవరం, ఫిబ్రవరి 23: మాచవరం మండలం మోర్జంపాడు గ్రామంలో వేంచేసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి 68వ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగు రోజులుగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన సీనియర్స్ విభాగంలో మొత్తం ఐదు జతలు పాల్గొనగా గుంటూరు జిల్లా తాడేపల్లి గ్రామానికి చెందిన లంకిరెడ్డి నిక్షిత్‌రెడ్డి, కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామానికి చెందిన మేకా కృష్ణమోహన్ కంబైన్డ్ ఎడ్లజత ప్రథమస్థానంలో నిలిచాయి. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ గ్రామానికి చెందిన సుంకి సురేందర్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన డి.రోహన్‌బాబు కంబైన్డ్ ఎడ్ల జత ద్వితీయ, కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామానికి చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్లు మూడవ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా లింగాయపాలెం గ్రామానికి చెందిన యల్లం సాంబశివరావు ఎడ్లు నాల్గవ, పొన్నూరు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన దాసరి నారాయణరావు ఎడ్లు ఐదవ స్థానంలో నిలిచాయి.

రేపు మంగళగిరి ఎయిమ్స్ జాతికి అంకితం

- వర్చువల్‌గా చేయనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- 9 క్రిటికల్ కేర్ బ్లాకులకు శంకుస్థాపన
- విశాఖలో మైక్రోబయాలజీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్
- ఏపీలో 4 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 23: కేంద్ర ప్రభుత్వం మంగళగిరిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం జాతికి అంకితం చేయనున్నారు. వర్చువల్ విధానంలో ఆయన ఎయిమ్స్‌ను జాతికి అంకితం చేయడంతోపాటు 9 క్రిటికల్ కేర్ బ్లాకులకు శంకుస్థాపన, విశాఖపట్నంలో మైక్రోబయాలజీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ, ఏపీలో మొత్తం నాలుగు మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రారంభించనున్నారు. మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎయిమ్స్ డైరెక్టర్ అండ్ సీఈవో డాక్టర్ మధుబానందకర్ వివరాలను వెల్లడించారు. 25న జరిగే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు డాక్టర్ మన్సూఖ్ మాండవ్య, ప్రహ్లాద జోషి, డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్, ఎస్పీ సింగ్ బఘేల్, ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని హాజరుకానున్నారని చెప్పారు.



2015, డిసెంబరు 19న 183.11 ఎకరాల విస్తీర్ణంలో రూ.1618.23 కోట్ల వ్యయంతో మంగళగిరి ఎయిమ్స్‌కు ఆనాటి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా శంకుస్థాపన చేశారని తెలిపారు. ఎయిమ్స్‌లో వైద్య కళాశాల, మెడికల్ ల్యాబ్, నర్సింగ్ కళాశాల, ఓపీడీ, ఇన్‌పేషెంట్, అత్యవసర సేవలు, రెసిడెన్షియల్ బ్లాక్, గెస్ట్ హౌస్, లైబ్రరీ, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ధర్మశాల బిల్డింగ్, ఆయుష్, ఆడిటోరియం, ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తిచేసుకుని అందుబాటులోకి వచ్చాయన్నారు. 2019, మార్చి 12 నుంచి అవుట్ పేషెంట్ విభాగం పనిచేస్తుండగా, ప్రస్తుతం ఓపీడీలో ప్రతిరోజు రోగుల సగటు 2,500గా వుందన్నారు. ఈ నెల 20వ తేదీ నాటికి 15 లక్షల ఓపీ సేవలు అందించినట్టు చెప్పారు. ఇప్పటివరకు 20 వేల మందికి పైగా ఇన్‌పేషెంట్ అడ్మిషన్లు, మరో 12 వేల మంది అత్యవసర సేవలు పొందినట్టు తెలిపారు. ఎంబీబీఎస్ కోర్సులో 2018లో ప్రారంభించగా, ప్రస్తుతం 600 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు చదువుకుంటున్నారని స్పష్టం చేశారు. మరో వంద మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో పీజీ కోర్సులను అభ్యసిస్తున్నారని వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పారామెడికల్ కోర్సులను కూడా ప్రారంభించాలని యోచిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిషన్స్) శశికాంత్ తుమ్మా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వినీత్ థామస్ అబ్రహం, అధికార ప్రతినిధి డాక్టర్ కే.వంశీకృష్ణ పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొడుతున్న కిలారి

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



పొన్నూరుటౌన్, ఫిబ్రవరి22: కులమతాల పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రయత్నిస్తున్నారన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆరోపించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మామ్మ అల్లుళ్ల ఉమారెడ్డి, కిలారి భాగోతాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. ఉమారెడ్డి వెంకటేశ్వర్లు ఎంపీగా పోటీ చేస్తే ఆయన సొంత నియోజకవర్గం బాపట్లలో మెజార్టీ రాలేదని, పొన్నూరులో వచ్చిన మెజారిటీతోనే ఆయన ఎంపీగా గెలిచారని గుర్తు చేశారు. తాము ఎంపీగా గెలిపిస్తే తనపై తన్న తమ్ముడిపై 20 మంది టీడీపీ కార్యకర్తలపై హత్య కేసు పెట్టించాడనా ఆవేదన వ్యక్తం చేశారు. తాను నోరు తెరిస్తే మామ్మ అళ్లులు నోరుకూడా ఎత్తలేనన్నారు. మామ అల్లుళ్ల చరిత్రే కాదు, ఇప్పుడు ఎంపీ అభ్యర్థిగా ఉన్న ఉమారెడ్డి వెంకట రమణ చరిత్ర కూడా తన దగ్గర ఉందన్నారు. చట్టపరమైన చర్యలు ప్రారంభించి వీళ్ల భాగోతాలను ప్రజల ముందు ఉంచనున్నట్లు నరేంద్ర కుమార్ హెచ్చరించారు. పొన్నూరు టికెట్టు తెచ్చుకుంటే ప్రజాక్షేత్రంలో పోరాడదామన్ని ఎమ్మెల్యే కిలారికి నరేంద్ర కుమార్ సవాలు చేశారు.

జగన్ పాలనలో మైనార్టీలకు తీరని ద్రోహం

● టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముస్తాక్


ప్రసంగిస్తున్న టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముస్తాక్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 23: ముస్లి మైనార్టీల సంక్షేమం కోసం కేటాయించిన రూ.వేల కోట్లను జగన్ రెడ్డి ప్రభుత్వం దారిమళ్లించి ముస్లిం, మైనార్టీలకు తీరని ద్రోహం చేసిందని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముస్తాక్ అన్నారు. మంగళగిరి నియోజకవర్గ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం పట్టణంలోని ఈద్గా ఫంక్షన్ హాలులో శుక్రవారం జరిగింది. సమావేశానికి టీడీపీ, జనసేన మైనార్టీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. తొలుత పట్టణంలో బైకుర్యాలీ నిర్వహించారు. వేదికపై స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహమ్మద్ ఇబ్రహీం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ముస్లిం మైనార్టీలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, మైనార్టీల సమస్యలపై చర్చించారు. ముస్తాక్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే మైనార్టీలకు అన్ని విధాలా సంక్షేమ ఫలాలు అందాయన్నారు. దైవ దర్శనానికి హజ్‌యాత్రకు వెళ్లేవారికి హజ్‌హౌస్‌ల నిర్మాణం, సబ్సిడీలు, దుల్హన్ పథకం అందిస్తానని వాగ్దానం చేసిన జగన్‌రెడ్డి హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్రంలో 80 ముస్లిం మైనార్టీ కుటుంబాలపై దాడులు జరిగితే సీఎం జగన్ నుంచి కనీస స్పందన లేదన్నారు. ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేసి వడ్డీలేని రుణాలను అందిస్తానని చెప్పి మైనార్టీలను దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. మైనార్టీలకు తీరని ద్రోహం చేసిన జగన్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలంతా ఐక్యంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి మహమ్మద్ నసీర్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, అధికార ప్రతినిధులు నాగుల్‌మీరా, సయ్యద్ రఫీ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నేత ఎంఎస్ బేగ్, హెచ్‌ఆర్సీ సభ్యుడు ఎస్సీ సాహెబ్, గుంటూరు పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ గని, టీడీపీ మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మజీద్, పట్టణ అధ్యక్షుడు షేక్ సుభానీ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

స్పైసెస్ వ్యాపార రంగంలోకి సంగం డెయిరీ

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ● మార్కెట్‌లోకి కారం, పసుపు, మషాలాల విడుదల


సంగం డెయిరీ నూతన ఉత్పత్తులను మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్న సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తదితరులు

చేబ్రోలు, ఫిబ్రవరి23: వినియోగదారుల అవసరాలకు అనుగుణంగాఆ సంగం డెయిరీ స్పైసెస్ వ్యాపారం రంగంలోకి అడుగుపెట్టినట్లు డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. వడ్లమూడి సంగం డెయిరీలో శుక్రవారం సంగం ఉత్పత్తులను నరేంద్రకుమార్ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు, సంగం స్పైసీ చిల్లీ పౌడర్, పసుపు పొడి, చికెన్ మసాల, సాంబార్ పౌడర్, గరం మసాలను వివిధ ప్యాకింగ్‌లలో మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 5,796 గ్రామాల్లో లక్షన్నర మంది పాడిరైతులతో సంగం డెయిరీ విస్తరించినట్లు చెప్పారు. రోజుకు 7.80 లక్షల లీటర్ల పాల సేకరణ చేస్తున్నామన్నారు. గుంటూరు జిల్లా అంటే కారంకు ప్రసిద్ధి అన్నారు. దుగ్గిరాల పసుపుకు పేరు కాంచిందన్నారు. గుంటూరు జిల్లాలో రైతులు పండించే ప్రతి పంటను సంగం ద్వారా మార్కెట్‌లోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా ఉన్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను సంగంతో భాగస్వామ్యం చేసుకొని వ్యవసాయ ఉత్పత్తులను సంగం కో ప్యాకింగ్ ద్వారా మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 8 వేల మందికి పైగా డిస్ట్రిబ్యూటర్లు, ఏజెంట్ల ద్వారా 92 రకాల పాలు, పాల పదార్థాలు, ఇతర ఆహార ఉత్పత్తులు, 174 పరిమాణాల్లో వినియోగదారుల గృహాలకు చేరవేస్తున్నామని అన్నారు. మసాల దినుసులను పుష్పా ఆగ్రోటెక్ సంస్థతో ఒప్పందం చేసుకొని సంగం కో ప్యాకింగ్‌లో మార్కెట్‌లోకి ప్రవేశపెట్టినట్లు చెప్పారు. నాణ్యతతో రాజీపడకుండా అత్యంత నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అందచేస్తున్నట్లు వివరించారు. సంగం డెయిరీ ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలన్ని విజ్ఞప్తి చేశారు. అలాగే వెన్న, నెయ్యిలో కల్తీలను పరీక్షించే హైపెర్ఫామెన్స్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ అధునాత యంత్రాలను విదేశాల నుంచి తెప్పించి నాణ్యతా పరీక్షలు ప్రారంభించిన్నట్లు చెప్పారు. నూతన పరీక్షల ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎండీ పి.గోపాళ్ళ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండ అభివృద్ధి, రోడ్ల నిర్మాణంపై అలసత్వం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి23: ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ అభివృద్ధి, అక్కడి రహదారి నిర్మాణం ప్రభుత్వానికి కనీసం గుర్తున్నాయా? అని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. కోటప్పకొండ తిరునాళ్ళకు సమయం దగ్గర పడుతున్నప్పటికీ పనులు నత్తనడకన సాగటం, రోడ్ల మరమ్మత్తులైతే ప్రారంభం కాకపోవటంపై విచారం వ్యక్తం చేశారు. త్రికోటేశ్వర స్వామి దేవాలయం రాష్ట్రంలోనే అత్యంత పురాతన ప్రసిద్ధ దేవాలయాల్లో ఒకటి అని, ఈ కోటప్పకొండ జాతరకు లక్షలాది మంది భక్తులు వస్తారని, అలాంటి చోట అభివృద్ధి, మౌలిక వసతులు ఎందుకు ఇంత అలసత్వం చేస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. కోటప్పకొండకు చేరుకోవటానికి నరసరావుపేట నుంచి రెండు, చిలకలూరిపేట ఒక దారి ఉన్నప్పటికీ అవేవి ప్రస్తుతం సరిగా లేవన్నారు. నియోజక వర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రభలు వస్తుంటాయని, కాని దారులన్నీ అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. ఆ దారుల్లో ప్రభలు ఎలా తీసుకు రావాలని? ప్రజలు పడుతున్న ఆందోళన గుర్తించి ఇకనైనా యుద్ధప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేయాలన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన కానిస్టేబుల్ సస్పెన్షన్

దాచేపల్లి, ఫిబ్రవరి 23: వివాహితను లైంగిక వేధింపులకు గురిచేసిన పోలీసు కానిస్టేబుల్‌ను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు శుక్రవారం దాచేపల్లి పోలీసులు తెలిపారు. దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వ్యక్తి తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని తనకు న్యాయం చేయాలని బాధితురాలు జిల్లా ఎస్పీ, గురజాల డీఎస్పీ, దాచేపల్లి సీఐలకు వినతిపత్రం అందజేసింది. బాధితురాలికి అండగా పలు ప్రజాసంఘాలు కూడా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాయి. గత ఐదు రోజుల క్రితం అధికారులు కానిస్టేబుల్‌ను వీఆర్‌కు తరలించగా ఈ రోజు సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు అందజేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

సీఎం సభకు బస్సులు రయ్.. రయ్..

● మళ్ళీ ప్రయాణికులకు కష్టాలు ● ప్రైవేటు వాహనాలతో జేబులకు చిల్లు



ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికుల పడిగాపులు

గుంటూరు, ఫిబ్రవరి 23: సీఎం సభ అంటేనే ఆర్టీసీ ప్రయాణికులకు ప్రయాణ కష్టాలు తప్పటం లేదు. తప్పనిసరి ప్రయాణాలైతే ప్రైవేటు వాహనాల బాట పట్టి జేబులకు చిల్లు పెట్టుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. మొన్నటి కి మొన్న అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం సిద్ధం సభకు బస్సులు తరలించిన ఆర్టీసీ యాజమాన్యం తాజాగా శుక్రవారం ఒంగోలు సభకు తరలించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాపట్ల జిల్లాలోని చీరాల, అద్దంకి, బాపట్ల డిపోల నుంచి 55 బస్సులు, గుంటూరు జిల్లాలోని పొన్నూరు, గుంటూరు -1, 2 డిపోలతో పాటు తెనాలి, మంగళగిరి డిపోల నుంచి 97, పల్నాడు లోని చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి డిపోల నుంచి 88 సర్వీసులను సీఎం సభకు తరలించారు. ఒంగోలులో పేదలకు ఇళ్ళ పంపిణీకి సంబంధించి సీఎం సభకు జన సమీకరణకు జిల్లా నుంచి 240 బస్సులను తరలించారు. అలానే నెల్లూరు జోన్ నుంచి 240తో కలిపి ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి మొత్తం 500 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. సీఎం సభకు బస్సులు గురువారం సాయంత్రమే వెళ్ళిపోవటంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా పల్నాడు ప్రాంతంతో పాటు తెనాలి, విజయవాడ, పర్చూరు, అమరావతి రూట్లలో ప్రయాణీకులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆటోలు, టాటా మ్యాజిక్‌లు, కార్లు వంటి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి అదనపు ఛార్జీలతో గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వచ్చింది. ఇక మార్కెట్ సెంటర్‌లోని పల్నాడు బస్టాప్ వద్ద ప్రయాణీకులు బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చిందని వాపోతున్నారు.

బస్సులన్నీ ముఖ్యమంత్రి సభకు..

బాపట్ల, ఫిబ్రవరి 23: బాపట్ల ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్డినరీ బస్సులు 27 ఉండగా అందులో 20 బస్సులు ఒంగోలులో జరిగిన ముఖ్యమంత్రి సభకు శుక్రవారం మళ్లించారు. 7 సర్వీస్‌లే మిగిలి ఉండటం వల్ల అధికారులు అన్ని ప్రాంతాలకు నడపలేకపోయారు. దీనివల్ల ప్రయాణికులు రోడ్ల వెంట పడిగాపులు కాస్తూ నానా ఇబ్బందులు పడ్డారు. ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు అందుబాటులో ఉండవు. ఆర్డనరీలు ఈ విధంగా ముఖ్యమంత్రి సభలకు తరలించటం ఇబ్బందిగా ఉందని పలువురు ప్రయాణికులు పేర్కొంటున్నారు.

రెండు ఇళ్లలో భారీ చోరీ


వినుకొండ ఎస్‌బీఐ ఏటీఎంలో తస్కరించిన ఏటీఎం కార్డు ద్వారా డబ్బు డ్రాచేస్తున్న అనుమానితులు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 23: సినిమా ఫక్కీలో దొంగలు రెక్కీ నిర్వహించి పెద్దమొత్తంలో బంగారం, నగదు దోచుకెళ్లిన ఘటన మండలంలోని పిట్టంబండ, గోనుగుంట్లవారిపాలెం గ్రామాల్లో జరిగింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే.. పిట్టంబండ గ్రామానికి చెందిన మక్కెన గంగాధర్ నివాసానికి తాళాలు వేసి ఉండగా బుధవారం అర్ధరాత్రి ఇంటికి వేసిన తాళాలను పగలగొట్టి ఇంట్లోని 19 సవర్ల బంగారు, 3కిలోల వెండి, రూ.2 లక్షలు దోచుకున్నారు. వీటితో పాటు దొంగిలించిన ఏటీఎం కార్డుతో రెండు ఏటీఎంలలో రూ80 వేలు డ్రా చేశారు. అదే రోజు రాత్రి గోనుగుంట్లవారిపాలెంలో దండు శ్రీనివాసరావు నివాసంలో 14 సవర్ల బంగారం, రూ.30 వేలు నగదు అపహరించారు. క్లూస్ టీమ్ గురువారం ఘటనా స్థలాల్లో వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ సాంబశివరావు తెలిపారు.

చేతబడి నెపంతోనే వ్యక్తి హత్య


దుండగులు తగలబెట్టిన మోటార్ బైక్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

ఈపూరు, ఫిబ్రవరి23: చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో గుర్తుతెలియని వ్యక్తులు తులసీ నాయక్(47)ను హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అగ్నిగుండాల సమీపంలో గురువారం తులసీనాయక్ హత్య జరిగిన విషయం విదితమే. సంఘటనా స్థలాన్ని నర్సరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, వినుకొండ సీఐ సాంబశివరావు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుంటూరు నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ వచ్చి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. బొల్లాపల్లి మండలం మాలపాడుకు చెందిన భూక్యా తులసీ నాయక్ గ్రామంలో పూజలు చేస్తూ ఆరోగ్యం బాగాలేని వారికి తాయిత్తులు వేస్తుంటాడు. గ్రామంలోని పొలాల్లో బోరులో నీరు రాకపోవడంతో ఈపూరు మండలం అగ్నిగుండాల సమీపంలో పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. తులసీనాయక్ బంధువు ఒకరు అనారోగ్యంతో మృతి చెందగా చేతబడి చేయడం వలనే చనిపోయాడని అనుమానం వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. తులసీ నాయక్‌ను హత్యచేసి అతని కుడిచేతి బొటన వేలు కోసుకొని వెళ్ళారు. అంతేకాకుండా అతని మోటార్ బైక్‌ను తగలబెట్టారు. బొటనవ్రేలు కోసుకొని పోవడం చూస్తే ఇది కచ్చితంగా చేతబడి చేసినాడనే అనుమానంతో హత్యచేశారని అనుమానిస్తున్నారు. తులసీనాయక్ భార్య మాత్రం తన భర్తకు అమ్మవారు పూనకం వస్తుందని, అందువలన ఇంట్లో పూజలు చేస్తామని పోలీసులకు చెప్పింది. తులసీ నాయక్ మృతదేహానికి వినుకొండ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ ఎస్కే మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



కొత్త ఓటర్ల పేర్లను యాప్‌లో నమోదు చేస్తున్న టీడీపీ బాపట్ల వారియర్స్

ప్రతి ఓటు తెలుగుదేశం వైపు : సరోజిని

బాపట్ల, ఫిబ్రవరి 23 : ప్రతి ఓటు తెలుగుదేశం వైపు మొగ్గు చూపే విధంగా పని చేస్తున్నట్లు ఆ పార్టీ బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజిని అన్నారు. మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ క్యాంపెయిన్ బాపట్ల మండలం ఈతేరు గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. 5వ బూత్‌లో పార్టీశ్రేణులతో కలిసి ఓటర్ల వద్దకెళ్ళి యాప్‌లో పేర్లు నమోదు చేశారు. ఓటుహక్కు పొందనివారి పేర్లు నమోదు చేసుకొని వివరాలు సేకరించి ఓటుహక్కు కోసం నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూచిపూడి ఝాన్సీరాణి, షేక్ నజ్మా, మండల పార్టీ అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, దగ్గుమల్లి రాణి, గ్రామ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ళపట్టాలు అందజేత చారిత్రాత్మక నిర్ణయం : కలెక్టర్



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

బాపట్ల,ఫిబ్రవరి 23 : రాష్ట్ర ప్రభుత్వం ఒక్కపైసా ఖర్చు లేకుండా నవరత్నాలు పేదలందరికి ఇళ్ళు పథకం కింద ఇళ్ళ పట్టాలు అందజేయటం చారిత్రాత్మక నిర్ణయమని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు ఎన్ అగ్రహారంలో శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఇళ్ళ స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేసిన సందర్భంగా బాపట్ల కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లాలోని జగనన్న కాలనీలలో నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను జాయింట్ కలెక్టర్ సి.హెచ్ శ్రీధర్, ఆర్డీవో రవీందర్‌లతో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సొంత ఆస్తిగా నివేశన స్థలంపై పూర్తి హక్కు కల్పించారని తెలిపారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు చేసుకోవాలన్నారు. జిల్లాలో 48 వేల మందికి రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలు అందజేసినట్లు తెలిపారు.

మెగాజాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల, ఫిబ్రవరి 23 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో అద్దంకి బలిజపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 27వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌లను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు 25కుపైగా కంపెనీలతో ఉదయం 9 గంటలు నుంచి జాబ్‌మేళా నిర్వహించి 2,500 మందికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు, అనేష్ తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 9542970871లో సంప్రదించాలన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి

● ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వాణి

బాపట్ల, ఫిబ్రవరి 23 : జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి తెలిపారు. బాపట్ల కోర్టు ప్రాంగణంలో శుక్రవారం పోలీసు అధికారులు, న్యాయవాదులు, బ్యాంక్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో జడ్జి మాట్లాడుతూ ఎక్కువ కేసులు పరిష్కరించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. తద్వారా ఎక్కువ కేసులు పరిష్కారం అవుతాయని చెప్పారు. సమావేశంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.పవన్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీకాంత్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహేంద్రనాధ్, బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ, పోలీసు, బ్యాంక్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులు, న్యాయవాదులు, బ్యాంక్ అధికారులతో సమావేశమైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి

ఎల్ఐసీ ఏజెంట్లు సాంకేతిక పరిజ్ఞానం పొందాలి

● అసోసియేషన్ ఆలిండియా సెక్రటరి జనరల్ ఎస్‌బి శ్రీనివాసచారి

బాపట్ల, ఫిబ్రవరి 23 : మారుతున్న కాలానికి అనుగుణంగా ఎల్ఐసీ ఏజెంట్లు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకొని ఆన్‌లైన్ ద్వారా పాలసీ చేయటంలో శిక్షణ పొందాలని ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ ఆలిండియా సెక్రటరి జనరల్ ఎస్‌బి శ్రీనివాసచారి తెలిపారు. బాపట్ల కిరాణా మర్చంట్స్ కల్యాణ మండపం లో ఎల్ఐసీ ఏజెంట్ అసోసియేషన్ 1964 అధ్యక్షుడు జయం వరబాబు ఆధ్వర్యంలో ఏజెంట్‌లకు ఎడ్యుకేషన్ సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రగతి సాధించిన ఏజెంట్‌లను సన్మానించారు. కార్యక్రమంలో బాపట్ల బ్రాంచ్ మేనేజర్ జి.గోపాలరావు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కోటేశ్వరరావు, సుమన్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ శాస్త్రి, ఆలిండియా నాయకులు ఎం.ఎస్.మూర్తి, ఉదయభాను, వెంకటరెడ్డి, మచిలీపట్నం డివిజన్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, శ్రీనివాసరాజు, జి.పద్మ, బ్రాంచ్ సెక్రటరి ఎం.జయకృష్ణ, కోశాధికారి గౌరిశంకర్, బి.సాంబయ్య, రాజేష్, కొల్లా శ్రీనివాసరావు, వీరాస్వామి, ఐ.శ్రీను, పి.శ్రీను, రామకృష్ణ, ఎస్.శ్రీను పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పద్ధతులపై రైతులకు శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

బాపట్ల, ఫిబ్రవరి 23 : పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా పంటపోగు, నిర్వహణ అనే అంశంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల దత్తత గ్రామం కావూరివారిపాలెం, బాపట్ల మండల రైతులు పాల్గొన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రైతులంతా కాలానికి అనుగుణంగా వస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రపరికరాలు హైడ్రోపోనిక్స్ మట్టి రహిత వ్యవసాయ విధానం, పంటకోత అనంతరం విలువజోడింపు అనే అంశంపై అవగాహన కల్పించారు. కళాశాలలో ఉండే యంత్ర పరికరాలు దత్తత గ్రామ రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాయని చెప్పారు. డాక్టర్ కె.కృపావతి, డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ బి.విజయ్‌కుమార్, రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. డాక్టర్ బి.జాన్‌వెస్లీ, డాక్టర్ జి.రవిబాబు, డాక్టర్ కేవీఎస్ రామిరెడ్డి, డాక్టర్ ఎం.మాధవ, డాక్టర్ ఆర్.గణేష్‌బాబు, డాక్టర్ బి.రాజ్‌కిరణ్, డాక్టర్ బి.హరిబాబు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వేటపాలెం కాల్వలో పూడిక తీయించాలంటూ వినతి

బాపట్ల, ఫిబ్రవరి 23 : జిల్లాలోని వేటపాలెం కాల్వ స్ట్రెయిట్ వద్ద మత్స్యకారులు బోట్‌లు నిలుపుకునేందుకు అనువుగా కాల్వలో పూడికతీయించాలని కోరుతూ రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ కన్నా మామిడయ్య ఆ ప్రాంత మత్స్యకారులతో కలిసి కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి సుబ్బయ్యపాలెం, ఊటుకూరి సుబ్బయ్యపాలెం, విజయలక్ష్మీపురం, కటారివారిపాలెం గ్రామాలలో సుమారు 300 బోట్‌ల ద్వారా చేపల వేట చేసుకొని మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. సదరుబోట్‌లు నిలిపేందుకు పొగరు వద్ద వేటపాలెం కాల్వ పూడికపోయి ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. పూడికతీయించి రెండువైపుల రాతితో వాల్ నిర్మించటానికి అనుమతి మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ నాయకులు కె.రాములు, వి.అంజయ్య, కేవీ గోవింద్, కె.నాగూర్, కొండూరి అంజయ్య తదితరులు ఉన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ



మహిళలకు చీరలు, సంచులు కరపత్రాలు అందజేస్తున్న నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 23 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఇంటింటికి తెలుగుదేశం, మీమాట-నాబాట, జనసేన, టీడీపీ జనబాట కార్యక్రమం శుక్రవారం బాపట్ల మండలం ఆసోదివారిపాలెం గ్రామంలో జరిగింది. టీడీపీ, జనసేన పార్టీశ్రేణులు కలిసి ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి మేనిఫెస్టో గురించి వివరిస్తూ మహిళలకు చీరలు, సంచులు, కరపత్రాలను అందజేశారు. మహిళల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సూపర్‌సిక్స్ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి బటన్ నొక్కి 10 రూపాయలు ప్రజలకిచ్చి 100 రూపాయలు తీసుకుంటున్నారని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరల ఆకాశాన్ని అంటాయని సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైసీపీ పాలనపై ప్రజలు విసిగిపోయారని ఎక్కడికి వెళ్ళిన తెలుగుదేశం పార్టీకి ఆదరణ ఇస్తున్నారని తెలిపారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవటమే లక్ష్యంతో ప్రతి ఒక్కరు ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికలలో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి అధిక మెజార్టీతో గెలిపించాలని నరేంద్రవర్మ కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ పథకాలపై అవగాహన కల్పించాలి : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీధర్

బాపట్ల, ఫిబ్రవరి 23 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని వ్యవసాయ అనుబంధ పథకాలపై సచివాలయ స్థాయిలో అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. జిల్లా స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ సలహామండలి సమావేశాలను గ్రామ, మండల స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించి రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. వ్యవసాయ సలహామండలి చైర్మన్ మంతెన దశరథమహరాజు మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి కాల్వలు, మురుగునీటి కాల్వల నిర్వహణకు అవసరమైన ప్రతిపాదనలు ముందుగానే ప్రభుత్వానికి పంపించాలన్నారు. ఉద్యానవనశాఖాధికారి పి.జెన్నెమ్మ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా బిందు, తుంపర సేద్యం పథకం ద్వారా రైతు పొలాలలో మిరప, మొక్కజొన్న, వేరుశనగ, అరటి, పసుపుపంటలకు రాయితీ ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి హనుమంతరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ, జిల్లా సూక్ష్మనీటి పథకం అధికారి రమణ, ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎంసి బాపయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరాదు : జేసీ

బాపట్ల, ఫిబ్రవరి 23 : జిల్లాలో ఈనెల 25వ తేదీ జరగనున్న గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. ఈ విషయమై శుక్రవారం చీఫ్ సూపరింటెండెంట్‌లు, లైజింగ్ ఆఫీసర్లుగా నియమించిన తహసీలార్లు, రూట్ ఆఫీసర్లు, పోలీసు, ఆర్టీసి, విద్యుత్ శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. 25 పరీక్షా కేంద్రాలకు సంబంధించిన అధికారులతో ఆయన మాట్లాడుతూ ఉదయం 9.30 నిమిషాలు నుండి 10 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించటం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్‌సీ నుంచి వచ్చిన ఆరోగ్యరాణి, సునీత పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ తిరుపతమ్మ గోపయ్య స్వామి కల్యాణం



శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామి

కర్లపాలెం, ఫిబ్రవరి 23 : కర్లపాలెం మండలంలోని చింతాయపాలెంలో ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి ఆలయం వద్ద శాంతి కల్యాణ మహోత్సవం ఆలయ అర్చకులు, ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో కన్నుల పండుగగా నిర్వహించారు. ముందుగా శ్రీతిరుపతమ్మ, గోపయ్యస్వామికి చందన, సుంగద, ద్రవ్య విశేష అభిషేకాలను ఘనంగా నిర్వహించారు. పుష్పార్చన నైవేద్యం అమ్మవారికి సమర్పించారు. రాత్రి పూజా కార్యక్రమాలు అనంతరం వేలాదిమంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయాన్ని విద్యుత్ వెలుగులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పరిసర ప్రాంతాలలో విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. బాపట్ల, గుంటూరు నలుమూలలు నుంచి వేలాదిమంది భక్తులు అమ్మ వారికి విశేష పూజలు నిర్వహించి అనంతరం ప్రసాదాలను స్వీకరించారు.

వేద విద్యను ప్రోత్సహించేందుకు విరాళం

బాపట్ల, ఫిబ్రవరి 23 : పట్టణంలోని శ్రీ శంకర విద్యాలయానికి వేద విద్యను ప్రోత్సహించేందుకు విజయవాడకు చెందిన పెమ్మరాజు శ్రీకృష్ణదివ్య రూ.1,60,000 విరాళాన్ని శుక్రవారం అందజేశారు. వేద పాఠశాల సెక్రటరి శిఖరం భుజగేంద్రమౌళికి అందజేసి వేద విద్యను ప్రోత్సహించాలని కోరారు. వేద విద్యాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని చెప్పారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

కర్లపాలెం, ఫిబ్రవరి 23 : కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో తూర్పు యాదవపాలేనికి చెందిన మద్దిబోయన శ్రీరాములు అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాల మేరకు డాక్టర్ బాలకృష్ణమూర్తి సహకారంతో పేరలి నరసయ్య చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల ఉపాధ్యక్షులు కాగిత బుల్లియ్య, మాజీ ఎంపీటీసీ గొర్రెముచ్చు మీరయ్య, కో ఆర్డినేటర్ పేరలి శ్రీనివాసరావు చేతులమీదగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు మృతుని కుటుంబానికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు గేరా ఏసుబాబు, మద్దిబోయన శివరావు, మల్లెపాలు, కాటూరి ప్రసాద్, బొలగాని వెంకటేశ్వర్లు, నాదెళ్ళ బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమం

కర్లపాలెం, ఫిబ్రవరి 23 : అబ్దుల్ కలాం ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ ప్రెసిడెంట్, గ్రామ ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా తెలిపారు. కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంవి రాజుపాలెంలో ఐదుగురు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం బియ్యం, నిత్యావసర సరకులు, దుప్పట్లు అనారోగ్యంగా ఉన్నవారికి ఆర్థికసాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు, షేక్.ఇబ్రహీం, షేక్ హబీబ్, షేక్ జిలాని, బహుదూర్‌బాషా పాల్గొన్నారు.

వలంటీర్ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

కర్లపాలెం, ఫిబ్రవరి 23 : వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి కర్లపాలెం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసినట్లు ఎంపీడీవో నేతాజి, ఈవోపీఆర్డీ ఏలీబాషా తెలిపారు.

విశ్రాంత ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి మృతి

బాపట్ల, ఫిబ్రవరి 23 : బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ తూములూరి కృష్ణమూర్తి మృతి చెందారు. ఆయన కొణిజేటి రోశయ్య శివలక్ష్మీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రస్తుతం కొనసాగుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కళాశాల విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు పంపిణీ

వేమూరు, ఫిబ్రవరి 23 : చేయూత దివ్యాంగుల వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థులు 80 మందికి ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్, అధ్యాపకులు సంఘం అధ్యక్షులు దాసరి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.



శాంతికుమారి పార్థివ దేహాన్ని సందర్శిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

వెల్లబాడు మాజీ సర్పంచ్ మృతికి ఆనందబాబు నివాళి

వేమూరు, ఫిబ్రవరి 23 : మండలంలోని వెల్లబాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంఠమనేని రవి భార్య, గ్రామ మాజీ సర్పంచ్ శాంతికుమారి (48)అనారోగ్య కారణాలతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆమె పార్థివదేహాన్ని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నగడ్డ విజయబాబు, టీడీపీ నాయకులు అమ్మిశెట్టి కిషోర్ బాబు, తులం రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కూటమితో రాష్ట్రానికి మేలు : శరత్‌చంద్ర

వేమూరు, ఫిబ్రవరి 23 : తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమితో రాష్ట్రానికి మేలు జరగబోతుందని టీఎన్ఎస్ఎఫ్ బాపట్ల పార్లమెంటరీ అధ్యక్షులు శరత్‌చంద్ర అన్నారు. వేమూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బ్రోచరును విడుదల చేశారు. జగన్ పాలనలో యువతకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తపరిచారు. యువత చైతన్యవంతులై రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమితో నిలబడే అభ్యర్థులకు విజయం చేకూర్చాల్సి ఉందన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ప్రజలు సుభిక్షంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కేసాని శివకృష్ణ, టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి కిషోర్ బాజీ, తలసిన మోహన్, మున్నంగి విజయ్, గుమ్మడి సాయిలంక, సుజీవ్, ఎల్లమాటి పవన్‌శ్యామ్, దివాకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 23 : మండలంలోని భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లి గ్రామంలో టీటీడీ రూ.10 లక్షలు, దాతల విరాళాలతో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలలో భాగంగా రెండో రోజు శుక్రవారం గణపతి, రుద్ర, నవగ్రహ చండీ సుదర్శన మూల మంత్ర హోమాలను జరిపించారు. ప్రతిష్ఠ చేయనున్న స్వామి విగ్రహాలను గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ రామచంద్రస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేక కార్యక్రమాలు అనంతరం శ్రీ సీతారామ కల్యాణం కనులపండువగా జరుగుతాయని శ్రీ సీతారామ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణం అనంతరం దేవస్థాన ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. బ్రహ్మశ్రీ ఆయులావఝ్ఝుల రామకృష్ణశాస్త్రి, నాగరాజశర్మ, శివకుమార్‌శాస్త్రిలు వైదిక కార్యక్రమాలను జరిపించారు.

గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

అమృతలూరు, ఫిబ్రవరి 23 : ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వార్షిక కళ్యాణం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. గూడవల్లి, నడింపల్లి, గోవాడ గ్రామాలకు చెందిన మహిళలు లలితా సహస్రనామం పారాయణం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అలపాటి రమాదేవి, ఈవో అశోక్‌రెడ్డి, మాజీ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పావులూరి సుబ్బారావులు పర్యవేక్షించారు.

సిద్దిబుద్ది అమ్మవార్లకు వెండి చీరలు బహూకరణ

వేమూరు, ఫిబ్రవరి 23 : వేమూరులో ప్రసిద్ధి చెందిన సిద్దిబుద్ది సమేత శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో దాతలు అమ్మవార్లకు శుక్రవారం వెండి చీరలను సమర్పించారు. స్వామివారికి గతంలోనే భక్తులు వెండి ధోవతిని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ద్వారా దాతలు అర్చకులకు వాటిని అందించగా మూలవిరాట్లకు అలంకరించారు.

అపరాల పంటను పరిశీలించిన లాంఫామ్ శాస్త్రవేత్తలు

అమృతలూరు, ఫిబ్రవరి 23 : రబీలో సాగు చేసిన మినుము, పెసర పంటలను లాం ఫామ్ శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. అమృతలూరు గ్రామానికి చెందిన క్రొత్తపల్లి శశిధర్‌బాబుకు చెందిన పంట పొలంలో వేసిన మినుము 904, 932 రకాలతో పాటు పెసర పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా లాంఫామ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ వెంకటరమణ మాట్లాడుతూ వరి సాగు భూముల్లో 904, 932 రకం అపరాలు అధిక దిగుబడులు ఇస్తాయన్నారు. ఈ రకంలో పల్లాకు తెగులు తట్టుకోవడంతోపాటు, తెగులు కూడా రాదన్నారు. ప్రస్తుత పంట దశలో పూతలో పురుగు, బూడిద గుర్తించినట్లు చెప్పారు. నివారణకు తగిన మందులు పిచికారి చేయాలని సూచించారు. ఆయన వెంట శాస్త్రవేత్తలు డాక్టర్ సతీష్‌బాబు, హరిసత్యనారాయణ, తురుమెళ్ళ వీఏఏ భాస్కర్, ఉమాకాంత్ తదితరులు ఉన్నారు.



మినుము పైరును పరిశీలిస్తున్న లాంఫామ్ శాస్త్రవేత్తలు వెంకటరమణ, సతీష్‌బాబు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, ఫిబ్రవరి 23 : మండలంలోని పోటుమెరక, గంగడిపాలెం, లంకేవానిదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలో 33/11కేవీ విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కరరావు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోటుమెరక, గంగడిపాలెం, లంకేవానిదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తదితరులు

అడవులదీవిలో మల్లికార్జునస్వామి తిరునాళ్ల

రేపల్లె, ఫిబ్రవరి 23 : నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామంలో ఉన్న శ్రీభ్రమరి బాల త్రిపుర సుందరి సహిత మల్లికార్జునస్వామి తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మల్లికార్జునస్వామికి ఏకాదశి రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకం, పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వేదమంత్రాలతో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన్ని సన్మానించారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు ఓగిబోయిన వెంకట్‌యాదవ్, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, పంతాని మురళీధరరావు, తాతా ఏడుకొండలు, కొలసాని రాము, కేసన రామకృష్ణ, పూజా కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం ఆలయ సిబ్బంది ద్వారా భక్తులకు ప్రసాదాలను అందించారు.

ఘనంగా తాళ్ళమ్మతల్లి...



ప్రత్యేక అలంకరణలో తాళ్ళమ్మతల్లి

నగరం, ఫిబ్రవరి 23 : మండలంలోని ధూళిపూడి గ్రామంలో శ్రీతాళ్ళమ్మతల్లి వీరమ్మ పేరంటాళ్ళ తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్ది నైవేద్యాలు సమర్పించారు. తాళ్ళమ్మతల్లి కుంకుమపూజలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. తాళ్ళమ్మతల్లికి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పట్టుచీర, సారె సమర్పించారు. తిరునాళ్ళ సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొని ఉంది. డప్పు విన్యాసాలు, డీజేతో, టపాసులతో ప్రభల వద్ద హోరెత్తించారు. తీర ప్రాంతంలోని ప్రజలంతా అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవంలో పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. భక్తుల కోసం మ్యూజికల్ నైట్ గ్రామస్తులు నిర్వహించారు.

వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలి

● ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 23 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధమవ్వాలని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలం దిండి గ్రామాల్లో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు ఓగిబోయిన వెంకట్ యాదవ్ ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అరాచకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతుందని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, టీడీపీ నాయకులు కూచిపూడి మోహన్‌రావు, నల్లపాటి యల్లయ్య, యేమినేని బుల్లిబాబు, కొలసాని రాము, బొర్రా సురేంద్ర, పి.గోపి, దండుప్రోలు పిచ్చియ్య పాల్గొన్నారు.



కార్యక్రమంలో భాగంగా మహిళలకు కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

రేపల్లె, ఫిబ్రవరి 23 : వైసీపీని తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని పట్టణ అధ్యక్షుడు గోగినేని పట్టాభిరామారావు అన్నారు. పట్టణంలో 9, 10వవార్డుల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందిస్తూ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి సహజ వనరులను దోచుకుతింటూ వేల కోట్ల రూపాయలను దాచుకుంటున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రాబోయేది టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దున్నా జయప్రద, నాగశ్రీ, మోర్ల అరుణ, షేక్ ఖాదర్‌బాషా, దేవగిరి రవిశంకర్, పంతాని సాయికుమార్, కేసన రామకృష్ణ, జీవీ నాగేశ్వరరావు, గుర్రం మురహరిరావు, మేకా రామకృష్ణ, ల్యాబ్ కిషోర్, దేవగిరి రంగ, దాసరి అమర్‌నాథ్, తాడిపర్తి మల్లికార్జున్‌రావు, డొక్కు బుజ్జి, డొక్కు గోపి, నీలా కోటేశ్వరరావు, గోగినేని శ్రీనివాసరావు, జనసేన నాయకులు దేవగిరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనగానిపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి : మల్లాది

చెరుకుపల్లి, ఫిబ్రవరి 23 : ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌పై అసత్య ప్రచారాలు చేసేందుకు వైసీపీ తెరలేపిందని టీడీపీ మండల అధ్యక్షులు మల్లాది రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు సోషల్ మీడియా ద్వారా నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలకు, ఫోన్‌కాల్స్ చేస్తు ఎమ్మెల్యే పార్టీ మారుతున్నారని టీడీపీ కార్యకర్తలకు, టీడీపీ ఓటు వేసేవారిని నిరుత్సాహపరిచేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు టీడీపీ సానుభూతిపరులు వైసీపీ చేస్తున్న ప్రచారాలను నమ్మవద్దన్నారు. అనగాని, టీడీ పీ గెలుపు కోసం జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమవేశంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ మొహమాటం రాధాకృష్ణమూర్తి, టీడీపీ జిల్లా నాయకులు ఉప్పాల సాంబశివరావు, దివి రాంబాబు, కందుల వెంకటేశ్వరరావు, దివి శ్రీనివాసరావు, నాగుల పున్నారావు, గడ్డిపాటి వెంకట్,వేము మోహన్, డి.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

చనిపోయిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి



రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు

రేపల్లె, ఫిబ్రవరి 23 : ఢిల్లీ సరిహద్దుల్లో మద్దతు ధర చట్టం చేయమని పోరాడుతున్న రైతులపై పోలీసుల జరిపిన కాల్పుల్లో పంజాబ్‌కు చెందిన యువ రైతు మృతిని తీవ్రంగా ఖండిస్తున్నామంటూ సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ అన్నారు. మోదీ ప్రభుత్వం కాల్పుల్లో ప్రాణాలు పోయిన రైతు కుటుంబాలకు సంఘీభావంగా శుక్రవారం పట్టణంలోని నెహ్రూ విగ్రహం వద్ద రైతు సంఘాలు, సీఐటీయూ ఆధ్వర్యంలో బ్లాక్‌డే నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు పోరాటాలు చేస్తుంటే సమస్య పరిష్కరించకుండా పోలీసులను అడ్డం పెట్టుకుని కాల్పులు జరపటం హేయమైన చర్య అన్నారు. మృతిచెందిన కుటుంబాలకునష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, రైతు సంఘ నాయకులు ఆశీర్వాదం, డి.శ్రీనివాసరావు, జీ.డానియేలు, వై.కిషోర్, ఎం.వెంకటేశ్వరరావు, అగస్టీన్ పాల్గొన్నారు.

ప్రజా రైతు వ్యతిరేక చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

రేపల్లె, ఫిబ్రవరి 23 : ప్రజా రైతు వ్యతిరేక చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని సీనియర్ న్యాయవాది పుప్పాల ఐజ్ అన్నారు. న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 48వరోజుకు చేరాయి. శిబిరంలో న్యాయవాదులు జమీర్ బాషా, ఎస్‌కే ఖాదర్‌వలి, ఎస్.రఘుకుమార్, ఎం.నాగరాజు ఉన్నారు. న్యాయవాదులు సూరిబాబు, కొలుసు రామారావు, కె.జగదీష్, వి.మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

అద్దంకి, ఫిబ్రవరి 23: మండలంలోని ధర్మవరం సమీపంలో ఉన్న భీమలింగేశ్వ రాలయం వద్ద తవ్వకాలు జరిగాయి. గతంలో కూడా పలుమార్లు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయి. గురువారం రాత్రి తవ్వకాలు చేసి పెద్దపెద్ద బండరాళ్లను బయట పడవేసి తవ్వకాల ఆనవాళ్ళు కనిపించకుండా నాపరాళ్ళను కప్పి సిమెంట్ పూత కూడా పూయటం అనుమానాలు కలిగిస్తుంది. అతి పురాతన ఆలయం కావటం, రాజుల కాలంలో ధర్మవరం కేంద్రంగా కొంతకాలం పాలన సాగించి ఉండటంతో గుప్త నిధులు ఉండి ఉంటాయన్న అనుమానాలతో తరచూ తవ్వకాలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి తవ్వకాలు చేసి సుమారు 30 బండరాళ్ళను పక్కనే పడవేశారు. అయితే, అంత ఖాళీలో ఏమి ఉపయోగించి పూడ్చారు అన్న విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం ఉదయం దేవాలయం వద్దకు వెళ్ళిన పాలక మండలి కమిటీ చైర్మన్ పచ్చవ విజయభాస్కర్ తవ్వకాలు జరిగిన విషయాన్ని గుర్తించి దేవదాయ అధికారులకు సమాచారం అందించారు. శనివారం దేవదాయ శాఖ అధికారులు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది.

ఆగని ఆక్రమణల పర్వం

» 2.70 ఎకరాల ప్రభుత్వ భూమికి రెక్కలు

అద్దంకి, ఫిబ్రవరి 23: అధికారులు ఎన్నికల విధులలో బిజీగా ఉండటంతో ఆక్రమణదారులు మరింత రెచ్చిపోయి ఆక్రమణల పర్వం కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పలు సార్లు అధికారులు స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినా మరలా యథావిధిగా ఇళ్ళ నిర్మాణాలు సాగిస్తున్నారు. ఉత్తర అద్దంకి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 19లో సుమారు 2.70 ఎకరాల భూమిని పూర్వంలో సాగుకు తాత్కాలికంగా ఇచ్చారు. అయితే, రెవెన్యూ అధికారుల విచారణలో పంటల సాగుకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారన్న విషయం తేలటంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అయితే, అవకాశం వచ్చినప్పుడల్లా ఇళ్ళ నిర్మానానికి సిద్ధం కావటం రెవెన్యూ అధికారులు అడ్డుకోవటం జరుగుతుంది. కొంతభాగాన్ని మున్సిపల్ అవసరాలకు కేటాయించగా, మరికొంత భూమి మిగిలి ఉంది. అధికారులు ఎన్నికల హడావుడిలో ఉండటంతో గత రెండు, మూడురోజులుగా ఇళ్ల నిర్మాణాలు మరింత ఊపందుకున్నాయి. రెండు రోజుల వ్యవధిలోనే గోడలు పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తిచేశారు. రెవెన్యూ అధికారులు వెళ్లినప్పుడు తాత్కాలికంగా పనులు ఆపటం, మరలా యథావిధిగా నిర్మాణ పనులు చేస్తున్నట్లు తెలుస్తుంది.



కట్టకిందపాలెం సమీపంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు

శింగరకొండ రోడ్డులో ఆటో నగర్‌ను ఆనుకొని ఉండటంతో మంచి విలువ ఉంది. ప్రభుత్వ అవసరాలకు కూడా వినియోగించుకునే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ళ నిర్మాణాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈవిషయాన్ని తహసీల్దార్ మహబూబ్ సుభాని దృష్టికి తీసుకుపోగా ఇప్పటికే తమ దృష్టికి రావటంతో పనులు నిలిపివేయించినట్టు చెప్పారు. మరోసారి సిబ్బందిని పంపించి చర్యలు చేపడతామని తెలిపారు.

వైసీపీ పతనం ఖాయం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

» 40 ముస్లిం కుటుంబాలు టీడీపీలో చేరిక

బల్లికురవ, ఫిబ్రవరి 23: వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని వల్లాపల్లి గ్రామానికి చెందిన 40 మంది ముస్లిం కుటుంబాల వారు గ్రామ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్‌తో కలిసి చిలకలూరిపేటలో ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ముస్లింలకు పలురకాల పథకాలను అందించామన్నారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం వారికి మొండిచెయ్యి చూపుతుందని ధ్వజమెత్తారు. రంజాన్ పండుగ వస్తే టీడీపీ రంజాన్ తోఫా అందిందని గుర్తుచేశారు. మసీదుల మరమ్మతులకు నగదు అందించినట్టు చెప్పారు. ముస్లింల వివాహానికి నగదు ప్రోత్సాహాన్ని కూడా అందించామన్నారు. అప్పట్లో ముస్లిం కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని, ఇప్పుడు వారి గురించి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. తిరిగి టీడీపీ అధికారంలోకి రాగానే మరలా వారికి సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంపై రోజురోజుకు వస్తున్న వ్యతిరేకతను గమనించి ప్రజలను తప్పుదోవ పట్టించాలని సిద్ధం అంటూ సభలు పెడుతున్నారని విమర్శించారు. ప్రజలు కూడా ఈ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని హామీలను అమలు చేశామని అబద్ధాలు చెబుతున్నారని ఆయన విమర్శించారు. మద్య పాన నిషేధం, ఉద్యోగులకు సీపీఎస్ అమలు, రైతులకు పోలవరం, అమరావతి రాజదాని నిర్మాణం చేయటం చేతకాని వైసీపీ ప్రభుత్వం అప్పులు తెచ్చి కొంతమందికి అరకొరగా పంపిణీ చేసి మిగిలిన దానిని తమ జేబుల్లో వేసుకుంటున్నారని ఎమ్మెల్యే రవికుమార్ ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రం మరలా పూర్వ వైభవం సాదించాలంటే ఎంతో అనుభవశాలి, సంపద సృష్టించిన మేధావి అయిన చంద్రబా బునాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా రావాల్సిన అవసరం ఉందన్నారు. టీ డీపీలో చేరిన వారిలో వైస్‌ప్రెసిడెంట్ షేక్ బడా ఖాశీం, మస్తాన్‌వలి, నాగుర్ మీరా, ఖాజావలి, దాదావలి, ఈసూవలి, ఖాశిం, అల్లాఉద్దీన్, హజరత్, సలీం, సైదా, దరియావలి, మాబుసుబాని తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నేతలు పరుసు ప్రేమప్రసాద్ బాబు, చింతల అమరనాథ్, ముట్లూరి మహేష్, తదితరులు పాల్గొన్నారు.



బల్లికురవ: ఎమ్మెల్యే రవికుమార్‌కు సంఘీభావం తెలుపుతున్న వల్లాపల్లి ముస్లిం నేతలు



సంతమాగులూరు: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యం

సంతమాగులూరు, ఫిబ్రవరి 23: సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, మన బిడ్డల భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీకి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్దగల అతిథి గృహంలో మండలంలోని గురిజేపల్లి, చవిటిపాలెం, తంగేడుమల్లి, మిన్నెకల్లు, బండివారిపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగున్నరేళ్ళుగా రాష్ట్రంలో అరాచక పాలనను ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. గడిచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో ఏఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తిచేయలేదన్నారు. సజ్జాపురం ఎస్టీ కాలనీకి చెందిన 20 కుటుంబాలు, యాదవకాలనీకి చెందిన పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో అట్లా చిన వెంకటరెడ్డి, ఆలూరి శ్రీనివాసరావు, సన్నెబోయిన ఏడుకొండలు, అట్లా పెద వెంకటరెడ్డి, తేలప్రోలు రమేష్, కంచేటి మురళి, దూపాటి ఏసోబు పాల్గొన్నారు.

మండలంలోని కామేపల్లికి చెందిన వైసీపీ నాయకులు గంటా రంగారావు, గుంపునేని రామారావు, గుండపునేని నరసింహారావు, గాడిపర్తి సాంబయ్య, శివన్నారాయణ, గుండపునేని శ్రీనివాసరావు తదితరులు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను కలసి మద్దతు తెలిపారు.



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

ప్రతి ఓటు కీలకం

చీరాల, ఫిబ్రవరి 23: రానున్న ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. 18 సంవత్సరాల నుంచి 80 సంవత్సరాల వరకు ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు చంద్రబాబు సీఎం అయితే ఒనగూరే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి, యువత భవితకు చంద్రబాబు మరలా సీఎం కావల్సిన చారిత్రాత్మక ఆవశ్యకతను వివరించాలన్నారు.

కార్యక్రమంలో నాయకులు నాతాని ఉమామహేశ్వ రరావు, నాశిక వీరభద్రయ్య షేక్ సుభాని, ధోని కనకరాజు, గజవల్లి శ్రీనివాసరావు, డేటా నాగేశ్వరరావు, గంజి పురుషోత్తమ్, ఉసురుపాటి సురేష్, కొమ్మనబోయిన రజిని, కౌతవరపు జనార్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుల నిరసన

పర్చూరు, ఫిబ్రవరి 23: పాఠశాలలోకి అనుమతించలేదని ఉపాధ్యాయులు గేటు వద్ద బైటాయించి నిరసన వ్యక్తం చేసిన సంఘటన మండలంలోని చెరుకూరు ఎయిడెట్ పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. పాఠశాలలో మ్యాథ్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సీహెచ్ వెంకటేశ్వర్లు, తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పద్మావతమ్మలు తమను ఉద్యోగం నుండి వాలంటరీ రిటైర్డ్‌మెంట్ ఇవ్వమని వేధిస్తున్నారని వాపోయారు. కరస్పాండెంట్ వేధింపులకు పాల్పడుతూ పాఠశాలలోకి అనుమతించకుండా నిరాకరించారని పేర్కొన్నారు.

ఈవిషయంపై డిప్యూటీ ఈవోతోపాటు, మండల విద్యాశాఖ అధికారులకు తమ సమస్యను వివరించినట్టు చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ రోటరీ ఆవిర్భావ దినోత్సవం

పర్చూరు, ఫిబ్రవరి 23: అంతర్జాతీయ రోటరీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్థానిక భవనం వీరారెడ్డి రోటరీ భవనంలో శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వివిధ వృత్తుల వారిని ఆహ్వానించి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు, క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, పాబోలు ఉదయభాస్కర్, కోమటి ఆంజనేయులు, గడ్డిపాటి శ్రీనివాసరావు, కటా శ్రీనివాసరావు, కారుమూడి సుబ్బారావు, భవనం రాజగోపాలరెడ్డి, మున్నంగి వెంకటసుబ్బయ్య, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, పాబోలు వెంకన్న, పోలిశెట్టి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

రైతుల నిరసన ర్యాలీ

ఇంకొల్లు, ఫిబ్రవరి 23: హర్యానాలో రైతులపై జరిగిన దాడులకు నిరసనగా ఇంకొల్లులో రైతు సంఘం ఆధ్వర్యంలో కాగడాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. రామమందిరం నుండి సినిమాహాల్ కూడలి వరకు రైతులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు, చిలుకూరి శ్రీనివాసరావు, బట్టు శ్రీను, మాదాల అంజియ్య, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువత భవిష్యత్తు

» ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఫిబ్రవరి 23: రాబోయే కాలంలో రాష్ట్ర యువత భవిష్యత్తు తెలుగు దేశం పార్టీతోనే ముడిపడి ఉందని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం ద్వారానే యువత భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. మండలంలోని ఇసుకదర్శిలో గల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మార్టూరులోని పోలేరమ్మ గుడి బజారులోని యువకులు టీడీపీలో చేరారు. వారందరికి పార్టీ కండువాను మెడలో వేసి ఏలూరి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మార్టూరు వీరాంజనేయులు, మార్టూరు సతీష్, తాతా అఖిల్, ఉప్పుటూరి పవన్, మణితేజ, ఎస్‌కే చాందా, నాగూర్, మౌలాలి, గుంటుపల్లి శ్రీను, మార్టూరు శ్రీను, మార్టూరు వెంకటేష్, సాయి పవన్, రాకేష్, తదితరులు ఉన్నారు. అలాగే, విజయ్‌నగర్ కాలనీకి చెందిన కొమర వీరబ్రహ్మం, కొమర శివ, తన్నీరు శ్రీను తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో కామినేని జనార్దన్, బండి చంద్రరావు, బూదయ్య, తొగటి వెంకట సుబ్బయ్య, తుమ్మల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన మార్టూరు యువకులు

జగన్ ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం కావాలి

మార్టూరు, ఫిబ్రవరి 23: రాజధాని లేని రాష్ట్రం చేసిన జగన్ ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం కావాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి మండలంలోని ఇసుకదర్శిలోగల క్యాంపు కార్యాలయంలో బొబ్బేపల్లి, జొన్నతాళి, రాజుగారిపాలెం, చిమ్మిరిబండ, ద్రోణాదుల, ఇసుకదర్శి గ్రామాల ముఖ్య నేతలు, మండల కమిటీ సభ్యులు బూత్ కన్వీనర్లు, పేజీ నేస్తం సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీని పటిష్ఠ పరచడానికి సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో ఐదేళ్ల నుంచి జరుగుతున్న విధ్వంస, అరాచక పాలనను అంతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారన్నారు. ప్రజల ఆలోచనలను, ఆకాంక్షలను నెరవేర్చడానికి కార్యకర్తలు కంకణబద్ధులై ముందుకు నడవాలన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ఇవే చివరి ఎన్నికలుగా ప్రజాతీర్పు ఉండే విధంగా కార్యకర్తలు పనిచేయాలని ఏలూరి పేర్కొన్నారు.

దర్జీల సమస్యలను పరిష్కరిస్తాం

చినగంజాం, ఫిబ్రవరి 23: చినగంజాం మండల పరిధిలోని దర్జీల సమస్యలను పరిష్కరిస్తానని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మార్టూరు మండలం ఇసుకదర్శిలో గల క్యాంపు కార్యాలయంలో మండల దర్జీల అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ ఆధ్వర్యంలో దర్జీలు శుక్రవారం ఏలూరిని మర్యాద పూర్వకంగా కలిశారు. దర్జీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల అనంతరం ఏర్పడే టీడీపీ, జనసేన ప్రభుత్వంలో దర్జీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో మండల దర్జీల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుల్తాన్ బాషా, కోశాధికారి పఠాన్ సుభాని, సభ్యులు షేక్ కరిముల్లా, సుభాని, బసవారెడ్డి, ఎం.సుబ్బారె డ్డి, లక్ష్మీదుర్గ, కోటేశ్వరమ్మ, రామకృష్ణ, షేక్ అమీర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు చేపడితే కఠినచర్యలు

బల్లికురవ, ఫిబ్రవరి 23: అనుమతులు లేకుండా ఎవరైన అటవీ భూములలో అక్రమంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని వేటపాలెం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ జాన్సన్ హెచ్చరించారు. వైసీపీ నేతల బరితెగింపు శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించారు. కొప్పెరపాలెం, ఉప్పుమాగులూరు ప్రాంతాలలో గ్రావెల్ తవ్వకాలు చేసిన ప్రదేశాలను పరిశీలించారు. పెద్ద ఎత్తున గ్రావెల్ తవ్వినట్లు ధ్రువీకరించారు. ఈ భూములు రెవెన్యూ పరిదిలో ఉందన్న విషయాన్ని వారికి సమాచారం పంపిస్తామని తెలిపారు. ఈసందర్భంగా సెక్షన్ ఆఫీసర్ జాన్సన్ మాట్లాడుతూ అటవీ భూములలోకి అనుమతులు లేకుండా ఎవరికి ప్రవేశం లేదన్నారు. యంత్రాలు పెట్టి రాత్రుళ్లు గ్రావెల్ మట్టి తవ్వితే వెంటనే యంత్రాలను సీజ్ చేస్తామని చెప్పారు.



గ్రావెల్ తవ్వకాలు చేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న వేటపాలెం ఫారెస్టు సెక్షన్ అఫీసర్ జాన్సన్, తదితరులు

కొన్ని గ్రామాలలో అటవీ భూములు, రెవెన్యూ భూములు కలిసి ఉండటంతో రైతు లకు అర్థంకాక అటవీ భూములలో తవ్వకాలు చేస్తున్నట్లు అపోహ పడుతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని అందరూ గమనించాలన్నారు. ఈ పరిశీలనలో కూకట్లపల్లి బీట్ ఆఫీసర్ రమేష్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడులకు రైతుల పాట్లు

» నీరులేక ఎండపోతున్న పైర్లు

పర్చూరు, ఫిబ్రవరి 23: ఆరుతడులు అందక కళ్ళముందే ఎండిపోతున్న పైర్లను చూచి రైతులు దిగాలు చెందుతున్నారు. ఎండిపోతున్న పంటలను రక్షించుకునేందుకు నీటికోసం నానా అగచాట్లు పడుతున్నారు. కనుమేర చూపులో నీరు అందుబాటులో లేక పోవటంతో ఏమిచేయాలో అర్థంకాని స్థితిలో రైతులు ఉన్నారు. నిన్నా మొన్నటి వరకు అరకొరగా కాలువలు, కుంటల్లో ఉన్న కొద్దిపాటి నీరుకూడా ఎండతీవ్రతకు ఆవిరి కావటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో వేల ఎకరాల్లో సాగుచేసుకున్న వైట్‌బర్లీ, మిర్చి పైర్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఎక్కడ చూచినా పైర్లు వడలిపోయి, ఎండుముఖం పట్టాయి. ఇప్పటికే వేలకు వేలు పెట్టుబడులు పెట్టి సాగుచేసుకున్న పంటలు ఇలా ఎండిపోతుండటంతో అన్నదాతల్లో నైరాశ్యం నెలకొంది. మరోపక్క మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందాన మిర్చి పైర్లను తెగుళ్ళు వెంటాడటంతో సమస్య మరింత దయనీయంగా మారింది.



చెరుకూరు సమీపంలో నీరులేక ఎండిపోతున్న వైట్‌బర్లీ పొగాకు

వైట్‌బర్లీకి నాణ్యమైన ధర ఉన్నా దిగుబడి అరకొరాగానే ఉంది. ఆరుతడులు లేక పైర్లు ఎండిపోతున్నాయి. పైర్లను రక్షించుకునేందుకు వేలకు వెచ్చించి ఆరుతడులు అందిద్దామన్నా నీరు అందుబాటులో లేదు.

'సముచిత సీట్లు కేటాయించాలి'

అద్దంకి, ఫిబ్రవరి 23: ఎన్నికలలో మాలలకు సుముచిత సీట్లు కేటాయించాలని మాల మహాసభ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్ లో జరిగిన అద్దంకి నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రాజకీయపార్టీలు మాలల భవిష్యత్‌ను దెబ్బతీసే విధంగా సమీకరణలు రూపొందిస్తున్నాయన్నారు. మాలలను నిర్లక్ష్యం చేసే రాజకీయ పార్టీలకు రానున్న ఎన్నికలలో తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో అంకం కిరణ్‌కుమార్, నాగేశ్వరరావు, నాగయ్య, వికాస్, తదితరులు పాల్గొన్నారు.

నల్లవాగులో మృతదేహం గుర్తింపు

అద్దంకి, ఫిబ్రవరి 23: అద్దంకి పట్టణంలోని నల్లవాగులో బయటపడ్డ మృతదేహం పట్టణంలోని గొర్లమిట్టకు చెందిన పాపనబోయిన శ్రీనివాసరావు(45)గా గుర్తించారు. శ్రీనివాసరావు గత శుక్రవారం ఇంటి నుంచి వెళ్ళిపోయి కనిపించలేదు.

నల్లవాగులో మృతదేహం ఉన్నట్లు తెలియటంతో కుటుంబసభ్యులు వెళ్ళి చూడగా శ్రీనివాసరావుదిగా గుర్తించారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. చేపల వేటకు వెళ్ళిన వ్యక్తులు వల వేయటంతో మృతదేహం నీటిపైకి వచ్చింది.

గంగపాలెంలో వ్యవసాయ మెటార్లు చోరీ

బల్లికురవ, ఫిబ్రవరి 23: మండలంలోని గంగపాలెంలో గురువారం అర్ధరాత్రి పంట పొలాల్లో ఉన్న ఐదు వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయి. గ్రామానికి సమీపంలో నల్లవాగు వద్ద ఉన్న పంట పొలాల్లో రాయుడు శివరామయ్య, ఆంజనేయులు, పోపూరి సుబ్బారావు, రమేష్, బి.డేవిడ్ అనే రైతులు పంట పొలాలకు నీరు పెట్టుకునేందుకు మోటార్లు పెట్టారు. గుర్తుతెలియని దొంగలు అర్ధరాత్రి సమయంలో ఐదుగురు రైతులకు చెందిన మోటార్లను తస్కరించారు. శుక్రవారం పంటలకు నీరు పెట్టుకునేందుకు వెళ్లిన రైతులు మోటార్లు లేకపోవటంతో బల్లికురవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీ అయిన మోటార్ల విలువ రూ.లక్ష పైచిలుకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

మినీవ్యాన్‌ను ఢీకొన్న కారు.. ఒకరికి గాయాలు

పంగులూరు, ఫిబ్రవరి 23: మిర్చి లోడుతో గుంటూరు వైపు వెళుతున్న మినీవ్యాన్‌ను వెనుకనుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని జాగర్లమూడివారిపాలెం గ్రామం వద్ద 16వ నెంబరు జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై గురువారం తెల్లవారు జామున జరిగిన ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తులు సీటు బెల్ట్ ధరించి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. వీరిలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. మినీ వ్యాన్‌ను అతి వేగంగా వెనుకనుంచి కారు ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న గస్తీ పోలీసులు నైట్‌డ్యూటీలో ఉన్న ఎస్ఐ చంద్రశేఖర్‌కు సమాచారం అందివ్వడంతో క్రేన్ సాయంతో రోడ్డుకు అడ్డంగా నిలిచిన కారును తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. గాయాలపాలయిన వ్యక్తిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రేణంగివరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చేనెల 6న పోలురాధా ఎడ్ల పోటీలు

చినగంజాం, ఫిబ్రవరి 23: మండలంలోని సోపిరాల గ్రామంలోని లలితాపరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని మార్చి 6న ఒంగోలు జాతి జూనియర్ ఎడ్ల విభాగంలో రాష్ట్ర స్థాయి నాటుబండి పోలురాధా ఎడ్ల పందాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సోపిరాల గ్రామ టైరుబండ్ల అసోసియేషన్, గ్రామస్థుల సహకారంతో రాష్ట్రస్థాయి నాటుబండి పోలురాధ ఎడ్ల పందాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9133377719, 8919494992 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 23: పర్చూరులో ఈనెల 25న జరగనున్న ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. ఈసందర్భంగా శుక్రవారం మండలంలోని పూనూరు గ్రామంలో ముస్లిం మైనారిటీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ రసూల్, మార్టూరు గ్రామ ఉపాధ్యక్షుడు సెల్ సుభాని, మాజీ సర్పంచ్ బోయపాటి సాంబయ్య, గ్రామానికి చెందిన మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు ఆపకపోతే ఎన్నికలను బహిష్కరిస్తాం

మార్టూరు, ఫిబ్రవరి 23: తమ గ్రామానికి చెందిన గ్రావెల్ కొండపై గత పదేళ్లుగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు, పట్టించుకోవడం లేదని మండలంలోని బొబ్బేపల్లి గ్రామస్థులు పేర్కొన్నారు. అక్రమ తవ్వకాలు ఆపకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని శుక్రవారం మార్టూరులో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. పదేళ్లలో రూ.వంద కోట్ల విలువైన గ్రావెల్‌ను అక్రమార్కులు తరలించుకుపోయారని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మహిళా సర్పంచ్ భర్త తాళ్లూరి కోటేశ్వరరావుతో పాటు పలువురు గ్రామస్థులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేదరమెట్ల, ఫిబ్రవరి 23: జాతీయ రహదారిలో మేదరమెట్ల - తిమ్మనపాలెం మధ్య శుక్రవారం మోటార్ సైకిళ్ళు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరు దుర్మరణం చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. విజయవాడకు చెందిన కోరంపల్లి ఆంజనేయులు, గుంటూరుకు చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు ఒంగోలు వైపు నుంచి గుంటూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఈక్రమంలో మేదరమెట్లకు చెందిన ఏ.క్రాంతికుమార్ స్కూటీపై వెళ్తూ ఎదురుగా వస్తున్న మోటర్‌సైకిల్‌ను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో కోరంపల్లి ఆంజనేయులు(43) అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున ఏడుకొండలు, ఎదురుగా వస్తున్న క్రాంతికుమార్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలుకు తరలించారు. మేదరమెట్ల ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

రైతు మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 23: గిట్టుబాటు ధర ఇవ్వాలంటూ పోరాటం చేస్తున్న రైతు ప్రాణాలు పోవడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ కార్మిక రైతు సంఘాల పిలుపు మేరకు చీరాల ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో బ్లాక్ డే నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ కేసులు ఎత్తివేయాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శామ్యేల్, అచ్యుతుని బాబురావు, మేడా వెంకటరావు, ప్రకాష్‌బాబు, వెంకటేశ్వర్లు, జయరామిరెడ్డి, మోహన్‌కుమార్ ధర్మ, రావూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా పోటీలకు విద్యార్థినుల ఎంపిక

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 23: రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ స్థాయిలో ఎస్.భానుప్రియ, జూనియర్ స్థాయిలో బుర్ల లోకేశ్వరి పోటీలో పాల్గొననున్నారు. ఒంగోలులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 24, 25 తేదీలలో నెల్లూరు జిల్లా ముత్తుకూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. ఈసందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని హసేరా, వ్యాయామ ఉపాధ్యాయిని రోజ్‌హెల్మా, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పద్మజ, వరలక్ష్మి, తదితరులు విద్యార్థినులను అభినందించారు.

నిందితుల అరెస్టు

చీరాలటౌన్, ఫిబ్రవరి 23: 15 గాడిదలు, ఒక గుర్రాన్ని అపహరించి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను చీరాల వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. కారంచేడు వైపు నుంచి స్టూవర్టుపురంకు చెందిన నలుగురు వ్యక్తులు టాటాఏస్ వాహనంలో వీటిని చీరాలకు తరలిస్తుండగా పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. వాహనాన్ని, జీవాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై పోలీసులు వివరాలు వెల్లడించాల్సి ఉంది.

భజన సంప్రదాయానికి ఆద్యుడు అన్నమాచార్యులు

అద్దంకి, ఫిబ్రవరి 23: ద క్షిణ పధంలో భజన సంప్రదాయానికి ఆద్యుడు తాళ్ళపాక అన్నమాచార్యులు అని రిటైర్డ్ ఆర్‌జేడీ దేవపాలన పేర్కొన్నారు. పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 521వ వర్ధంతి సందర్భంగా అద్దంకి పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాస భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, దామా హనుమంతరావు, చెన్నుపాటి రామాంజనేయులు, అన్నమనేని వెంకటరావు, షేక్ మస్తాన్, మాబు సుభాని, చెన్నుపల్లి పవన్‌వెంకటసాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు న్యాయవాది నారిమన్ మృతికి సంతాపం

పర్చూరు, ఫిబ్రవరి 23: సుప్రీం కోర్టు ప్రముఖ న్యాయవాది నారిమన్ మృతికి పర్చూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు భవనాల సముదాయంలో న్యాయవాదులు సంతాపం తెలియజేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో న్యాయవాదులు రావి సత్యనారాయణ, మేకల రవీంద్రనాథ్‌రెడ్డి, రావి శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి గోవిందరాజులు, రావి రమేష్‌బాబు, చాగంటి సుబ్బారావు, పోతిని సురేంద్ర తదితరులు ఉన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

అద్దంకి, ఫిబ్రవరి 23: అద్దంకి పట్టణంలోని వింధ్యావాసిని సమేత నగరేశ్వర స్వామి (వేయిస్తంబాల గుడి) దేవాలయంలో షష్టమ కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం రుద్రహోమం నిర్వహించారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.